ప్రజాశక్తి

గురువారం 12 జూన్ 2025 16 పేజీలు



తిరుపతి

చిత్తూరు

పెట్టు'బడుల' సీజన్ ప్రారంభం

తల్లిదండ్రుల్లో ఫీజుల బెంగ
రైతుల్లో 'విత్త(న)ం చింత

2లో

బడి 'గంట' మోగింది

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- నేడే 'తల్లికి వందనం' జమ..?
- 90 శాతం అందుబాటులోకి 'స్టూడెంట్ కిట్స్'
- కొలిక్కిరాని ఉపాధ్యాయ బదిలీలు

2లో

శ్రీ వాసవి
సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్
రవీంద్ర భారతి బిల్డింగ్, తాటిమాకులపాళ్యం, పుంగనూరు
Punganur Town First
Olympiad
IIT Foundation
Navodaya
Sainik & RMS
బాలికలకు హాస్టల్ వసతి కలదు
Hlt No: 1210020406
267/300
శ్రీ జ్ఞానాంబిక ఇంగ్లీష్ మీడియం స్కూల్
రవీంద్రభారతి బిల్డింగ్, తాటిమాకులపాళ్యం పుంగనూరు
మొదటి సంవత్సరంలోనే 100% ఉత్తీర్ణత సాధించిన
శ్రీ జ్ఞానాంబిక విద్యార్థులకు
ఇవే మా అభినందనలు
100% RESULTS
K. JEEVANA PRIYA 2520118372 550/600
J. VARSHI 2523120906 537/600
S. SURENDRA REDDY 2520119003 328/600
ఇందుకు కృషి చేసిన విద్యార్థులకు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లితండ్రులకు ధన్యవాదములు
ఇట్లు: పాఠశాల యాజమాన్యం, అడ్మీషన్లు జరుగుచున్నవి
సెల్: 8688 597 009, 8712 244 114

Brundavan
ENGLISH MEDIUM SCHOOL
(Affiliated to CBSE, New Delhi. Affiliation No. 130607)
D.No.6-566/2A, Beside Nagalamma Temple,Santhapet, Chittoor. PIN. 517001
Ph : 9440264769,9490358679.
www.brundavanschool.com

Classes : Nursery to XII
(Affiliated to CBSE, New Delhi)
OFFERING GRADES XI & XII
CBSE CURRICULUM | SCIENCE & COMMERCE STREAMS
XI / XII GROUPS OFFERED
- Physics, Chemistry, Mathematics, Computer Science
- Physics, Chemistry, Biology, Computer Science
- Mathematics, Economics, Business Studies, Accountancy
- Accountancy, Economics, Business Studies, Computer Scien
- Physics, Chemistry, Maths, Biology

Brundavan Focuses Mainly on
JEE / NEET
*Child Centric Learning
*Daily, weely and Monthly Objective & Subjective Tests are Conducted.
*Clean and green campusm, spacious classrooms, well developed lab facilities
*Transport Faculty available in all routes in and around chittoor.
PROGRAMS OFFERED
IIT-JEE
NEET
CA- CPT
FOUNDATION (VI - IX)
Smt.L. Sailaja Kumari
M.A., M.Phil., B.Ed.,
Correspondent

స్విమ్స్‌ను అత్యున్నతంగా తీర్చిదిద్దుతాం : బిఆర్ నాయుడు

వార్త.. 16లో

Vijayam the Sure Way to Success...
విజయం విద్యాసంస్థలు
2025-26 ADMISSIONS OPEN
FOR ALL WINGS
ENGINEERING COLLEGE
from VIJAYAM Group
Counselling Code
VJAM
A Primier Hub for Hostilic Learning from School to Engineering & Management

CBSE & Dr.VIIT | STATE BOARD | JUNIOR - BOYS CAMPUS | JUNIOR - GIRLS CAMPUS | DEGREE & BHM | B.Tech - MBA - MCA
20-49, Naidu Buildings, Mittoor, Chittoor. Contact : 08572 – 230145, 230146.

బడి'గంట' మోగింది

ప్రజాశక్తి - తిరుపతి

బడిగంట మోగింది. గురువారం నుంచి పాఠశాలలు పున్ణప్రారంభం కానున్నాయి. ఇన్నాళ్ల వేసవి సెలవులతో సేదతీరిన విద్యార్థులు పాఠశాల బాట పట్టారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్ అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 90 శాతం కు పైగా 'స్కూల్ కిట్స్ ' అందుబాటులోకి తెచ్చారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీలైన 'సూపర్ సిక్స్' లో భాగంగా 'తల్లికి వందనం' పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో గురువారం రోజునే 15,000 చొప్పున జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సోమవారం రాత్రి తొమ్మిది గంటల వరకు కూడా విద్యాశాఖ అధికారులకు మౌఖికంగా తప్ప ఉత్తర్వులు రాకపోవడం గమనార్హం. ఇదే సందర్భంలో ప్రభుత్వ మాత్రం తప్పనిసరిగా గురువారమే తల్లుల ఖాతాలో జమ అయ్యేలా చూస్తామని భరోసా ఇస్తోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 లక్షల మందికిపైగా అర్హులైన విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లాలో మాత్రం 2,98,140 మంది విద్యార్థులు లబ్ది పొందాల్సి ఉండగా ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు రెండు లక్షల మందికి కూడా ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతుండటం గమనార్హం. పాఠశాలలు పున్ణప్రారంభిస్తున్నప్పటికీ ఇప్పటికీ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తికాలేదు.

'తల్లికి వందనం' గందరగోళం

పేద పిల్లలు చదువును మధ్యలోనే ఆపకుండా కొనసాగించేందుకు తల్లికి వందనం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి విద్యార్థికీ ఏటా రూ. 15,000 ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఇది వర్తిస్తుంది. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు ఈ సాయం అందిస్తారు. ఈ మొత్తాన్ని తల్లి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తారు.

స్కూళ్లకు చేరుతున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు

ప్రభుత్వ నిబంధనల మేరకు...

విద్యార్థి 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండాలి. విద్యార్థికి కనీసం 75శాతం హాజరు తప్పనిసరి. విద్యార్థి తల్లి పేరు మీద బ్యాంక్ ఖాతా ఉండాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలే ఈ పథకానికి అర్హులు (పేదరిక రేఖకు దిగువన ఉండాలి). ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల పిల్లలు ఈ పథకానికి అర్హులు కారు.

ఎన్పీసీఐ లింకింగ్ తో సమస్య !

తల్లికి వందనం పథకం ద్వారా ప్రయోజనం పొందాలంటే, విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో అనుసంధానించడం (ఎన్‌పిసిఐ లింకింగ్) తప్పనిసరి. సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. లేదా నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్ ద్వారా కూడా ఆధార్‌ను లింక్ చేసుకునే అవకాశం ఉంది. మీ సేవా కేంద్రాల ద్వారానూ ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంది. అయితే ఎన్‌పీసీఐ లింకింగ్ అయ్యిందో, లేదో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కూడా లింకింగ్ సమస్యతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

పెట్టు'బడుల' సీజన్ ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జూన్ మాసం వచ్చిందంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఖర్చుల బెంగ పట్టుకుంటుంది. విద్యార్థుల స్కూలు, కాలేజీ ఫీజులకు తోడు ఖరీఫ్ సీజన్ నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం..మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకేసారి ప్రారంభం కావడంతో అన్ని కుటుంబాలపై ఏదో ఒక రూపంలో ఖర్చుల భారం పడే పరిస్థితి నెలకొంటుంది. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ బడుల తెరుచుకోనుండటంతో ఫీజులు, బ్యాగులు, పుస్తకాలు అంటూ తల్లిదండ్రులు అదనపు ఖర్చుల భారం మోయక తప్పని పరిస్థితి.

తల్లుల్లో ఫీజుల బెంగ

వేసవి సెలవులు నేటితో ముగియనున్నాయి. పాఠశాలలు, కాలేజీలు తెరచుకోనున్నాయి. శ్రీకాళహస్తిలో అయితే ఇప్పటికే ప్రవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు షురూ అయిపోయాయి. చాలా ప్రైవేటు స్కూళ్లలో తరగతులు ప్రారంభమైనట్లు సమాచారం. నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పొరేట్ స్కూళ్ళలో అయితే బేబీ క్లాసు, ఎల్కేజీ తరగతులకే రూ.30 నుంచి రూ.35 వేలు దాకా ఫీజులు రూపంలో వసూళ్లు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇక 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఫీజులు సంగతి చెప్పనక్కర్లేదు. ఆపై యూనీ ఫామ్, పుస్తకాలు, బస్సు రవాణా ఫీజులు సరే సరి. ఈ లెక్కన ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.50 వేలకు పైనే ఖర్చు అవుతుంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 3041 పాఠశాలలు ఉండగా, ఇందులో 670 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. దాదాపు అన్ని ప్రైవేట్ స్కూళ్ల నుంచి తల్లిదండ్రులకు ఫీజులు కట్టాలని ఫోన్లు చేస్తూ ఒత్తిడి కాల్స్ వస్తున్నట్లు సమాచారం. దీంతో తల్లిదండ్రులు అప్పో సప్పో చేసి పిల్లలు ఫీజులు కట్టేందుకే మొగ్గు చూపుతున్నారు. ఫీజుల మోతతో తల్లితండ్రులపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్మెంట్, తల్లికి వందనం లాంటి పథకాలను ఇంకా ఇవ్వకపోవడంతో పెరిగిన పుస్తకాలు, ఫీజులు ధరలకు సామాన్యుల ఆదాయం ఏ మూలకూ సరిపోని పరిస్థితి. ఇక ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి రూ.3 లక్షల వరకు ఫీజులు సమర్పించుకోవాల్సిన వైనం. నీట్, జేఈఈ మెయిన్స్ అంటూ అదనంగా ఫీజులు గుంజుకునేస్తున్నారు. ఉన్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, నిరుద్యోగులకు పెనుభారంగానే ఉండనుంది.

పెట్టుబడి 'భారం'

జూన్ మాసం ప్రారంభమైతే ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమవుతుంది. నైరుతి రుతుపవనాల కారణంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఈ సారి అనుకున్నదాని కంటే బాగానే వర్షాలు కురిసాయి. జూన్, జూలై మాసాల్లో కూడా సమృద్ధిగా వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావారణ శాఖ చెప్పుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు భారీగా సమాయత్తమవుతున్నారు. దీంతో రైతులు పొలంలో వేసవి దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వం నుంచి రైతాంగం డిమాండ్ మేరకు జిల్లా లో వేరుశెనగ, పచ్చి రొట్ట విత్తనాలను ప్రభుత్వం ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. దీంతో చేతిలో చిల్లి గవ్వ లేకున్నా రైతులు శెనగ విత్తనాలను అప్పు చేసి కొంటున్నారు. మార్కెట్లో 30కేజీల వేరుసెనగ బస్తా రూ.4 వేలు ఉంది. అయితే రైతు పండించిన శెనక్కాయ బస్తా కేవలం రూ. 2220 ఉండటం విచారకరం. వరి సాగుకు ఎకరాకు రూ.30 వేలు, శెనగ సాగుకు రూ.45 వేలు దాకా పెట్టుబడి ఖర్చు అవుతోంది. ఈ క్రమంలో రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ ల పేరిట సర్కారు నుంచి రైతుకు అందుతున్న పెట్టుబడి సాయం అంతంతమాత్రమే. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం పంటలకు ఇన్పుట్ సబ్సిడీ అందించినా అది నామమాత్రమే. ఇలా ఎటు చూసినా జూన్ మాసంలో సామాన్యులకు 'పెట్ట'బడులు' ఖర్చు తడిసి మోపెడవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు రైతుకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజన్‌కు ముందే పెట్టుబడి సాయమివ్వాలి



జగ్గయ్య, రైతు, బోనుపల్లి

ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా రైతును ఆదుకునే చొరవ తీసుకోవడం లేదు. కనీసం రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు కూడా ఇవ్వడం లేదు. సీజన్ కు ముందు పెట్టు బడి సాయం అందిస్తే రైతుకు అండగా ఉంటుంది.

యూనివర్సిటీ వసతి గృహంలో చోరీ

రూ.10 లక్షల విలువైన వస్తువులు మాయం

ప్రజాశక్తి - క్యాంపస్

రెండు రోజుల క్రితం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలోని ఆర్ట్స్ విద్యార్థులకు సంబంధించిన వసతి గృహంలో పదిలక్షల విలువగల వస్తువులను దొంగలు దోచుకెళ్లారు. ఆ విషయాన్ని అధికారులు గుట్టుచప్పుడు కాకుండా కప్పి పెట్టే ప్రయత్నం చేశారు. అయితే అలా అలా ఈ విషయం విద్యార్థిసంఘాల దృష్టికి చేరింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థులు నివ్వెరపోయే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. హెచ్ బ్లాక్‌లో ఎన్నడూ లేని విధంగా బిల్డింగ్ వెనుక భాగాన గోడ బద్దలు కొట్టి స్టీలు కుళాయిలు, సింకులు, ట్యూబ్‌లైట్లు, కుర్చీలు ఇతరత్రా వస్తువులను దోచుకెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది 30 మంది ఉన్నా ఇలాంటిపరిణామాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. బయట వ్యక్తులు వర్సిటీ లోపలికి చొరబడి దొంగతనం చేసే సాహసం చేయరని, ఇదంతా యూనివర్సిటీలోని ఇంటి దొంగల పనేనని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇదంతా జరుగుతుందన్నారు. ఈ భారమంతా తిరిగి విద్యార్థులపైనే వేస్తారన్నారు. వసతి గృహాల్లో సిసి కెమెరాలు ఉన్నా రూ.10 లక్షల విలువైన వస్తువులు పోవడం, చోరీ చేసిన వారిని పట్టుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇకనైనా యూనివర్సిటీ పోలీసులు స్పందించి ఈ దుశ్చర్యకు కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

కేకేజీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి- కాసరం-గొల్లగుంట బీటీ రోడ్డును బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని దొమ్మర మిట్టనుంచి కాసరం వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర రూ. 1.50 కోట్ల వ్యయంతో ఈ రోడ్డును నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. నాడు-నేడు అంటూ జగన్ ఊదరగొట్టారే తప్ప, పల్లె రోడ్ల బాగోగులు పెడచెవిన పెట్టారని మండిపడ్డారు. గుంతలకు కనీసం మట్టి కూడా రాల్చలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లకు మహర్దశ పట్టిందని కొనియాడారు. కార్యక్రమంలో రావిళ్ల మునిరాజా నాయుడు, గాలి మురళి నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, దావులూరి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి స్కూలును ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఒకటవ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్ లో నిర్మించిన ఎంపిపి స్కూల్ ను బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు. స్కూల్ ఆవరణను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్డీఏ కూటమి వచ్చిన వెంటనే స్కూల్ పనులు ప్రారంభించి ఏడాది లోపే ప్రారంభించుకోవడం విద్యకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. విద్యారంగాన్ని అభివద్ధిపరిచి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాసామగ్రిని విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పేదరికం చదువుకు అడ్డు రాకూడదని తల్లికి వందనం పథకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. ఈ పథకం నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతలకు గురువారం స్కూల్స్ ప్రారంభం సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం జమ చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని అమలు చేస్తూ డ్రాప్ అవుట్స్ ను పూర్తిగా నియంత్రించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిమ్మినాయుడుపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు వేయడంతో స్కూల్ భవనం తొలగించారని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా చింతలచేను వద్ద స్కూల్ నిర్మించాలని అన్నారు. అభివద్ధి పనుల్లో భాగంగా మండల పరిషత్ స్కూల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి ప్రారంభించామని అన్నారు. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరి ఒక్కో క్లాస్ కు ప్రత్యేకంగా ఒక్కో గది ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ అన్నా అనిత, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ.రమణ పాల్గొన్నారు.

ఆటోనగర్‌ను పరిశుభ్రంగా ఉంచండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఆటోనగర్‌లో వాహనాలు మరమ్మతులు చేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య దుకాణదారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆటోనగర్ లోని వాహనాల మరమ్మత్తులు నిర్వహించే ప్రాంతాలను ఉన్నతాధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. పలు చోట్ల ఎక్కడపడితే అక్కడ టైర్లు, వాహనాల విడి భాగాలు పడేసి అపరిశు భ్రంగా ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేసినా, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లోని దుకాణదారులకు అపరాధ రుసుము విధించాలని అధికారులను ఆదేశించారు. చెత్త కాల్చడం వంటివి చేయకుండా చూడాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. స్థానికులు, దుకాణదారుల కోరిక మేరకు డ్రైనేజీ కాలువలు నిర్మాణం, రోడ్ల ఏర్పాటుకు పరిశీలన చేస్తామని అన్నారు. కమిషనర్ వెంట ఐలా కమిషనర్ రాంబాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజీ, డి.ఈ.లు రమణ,శిల్ప తదితరులు ఉన్నారు.

నేడు కూటమి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి (ప్రమాణస్వీకారం చేసి) ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పుత్తూరు పట్టణంలో అన్నా క్యాంటీన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఉదయం సంబరాలు నిర్వహించ నున్నారు. కేక్ కట్‌చేసి ర్యాలీ నిర్వహిస్తామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, రూరల్ పార్టీ అధ్యక్షులు ఎ బాలాజీ, కార్యదర్శి వెంకటేష్ బుధవారం కోరారు. ఈ విజయోత్సవ సంబరాలలో పుత్తూరు మున్సిపాలిటీ, రూరల్ మండలాలకు సంబంధించిన అన్ని వార్డుల, పంచాయతీల నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాదకరంగా మారిన గుంత

ఆదమరిస్తే అంతే సంగతి!

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని (శ్రీకాళహస్తి– తడ ప్రధాన రహదారిలో శ్రీ సిటీ నుండి తిరుపతి కి 'తులాని ప్రాజెక్ట్ కంపెనీ వారు గ్యాస్ పైప్ లైన్ పనులు ప్రారంభించారు, అందులో భాగంగా మరదవాడ, బస్టాప్ సమీపంలో రహదారి మలుపు వుండడంతో పైప్ లైన్ కోసం కాలువ తవ్వారు.. అయితే ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డు లేకుండా అలాగే వదిలేశారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల నుండి మలుపు వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డు లేకుండా గుంతలను పూడ్చకుండా గాలికి వదిలేశారు. వాహనదారులు రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆ మార్గం నుండి రాత్రి సమయాల్లో శ్రీ సిటీ కంపెనీలకు వందల సంఖ్యలో వాహనాలు పోతూ వస్తూ ఉంటాయి. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదకర పరిస్థితి అంతే సంగతి అని ఆందోళన చెందుతున్నారు. గుంతను తవ్వి వారం, పది రోజులు అవుతున్న సంబంధిత అధికారులు ఇంతవరకు ఆ గుంతను పూడ్చకపోవడం విడ్డూరంగా ఉందని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో పలుమార్లు నిందితుడిగా తేలిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన అజిత్ బాబు అలియాస్ అజిత్ (స్మగ్లర్)పై తిరుపతి టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యదరణ అమలులో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో నిందితులను కోర్టు ముందు ఉంచి వారికి శిక్షలు విధించడం, వీటిని కూడా అతిక్రమిస్తున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా 10 కంటే ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న అజిత్ బాబు అలియాస్ అజిత్ (22)పై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు సిఫారసు చేయగా తిరుపతి కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అతనిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు అధికారులు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు.

మామిడి కాయల అన్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న తహశీల్దారు శ్రీదేవి

మామిడి అన్‌లోడ్ తనిఖీ

మద్దతు ధర అమలుకు తహశీల్దారు చర్యలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని గాజుల పెళ్లూరుకు చెందిన రాస ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి బుధవారం దామల చెరువు, రైల్వే కోడూరు నుంచి తొమ్మిది లోడ్ల లారీలు తోతాపురి మామిడి రకం లోడ్‌లు వచ్చాయి. మామిడి కాయలను అన్‌లోడ్ చేయడాన్ని తహశీల్దారు శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కంపెనీకి వస్తున్న, స్థానిక రైతులు, లారీ డ్రైవర్లు, యాజమాన్యంతో మాట్లాడి లారీ డ్రైవర్లకు భోజన సదుపాయం , మంచినీటి సదుపాయం వంటి అవసరాలను కల్పించాలని ఆదేశించారు. సబ్సిడీ గురించి వారికి వివరించారు. అన్‌లోడింగ్ కాని, లేదంటే కంపెనీ పనితీరును ప్రతి రోజూ పరిశీలిస్తామని తెలిపారు. మండలంలోని రైతులకు కేజీకి ప్రభుత్వం తరపున 12 రూపాయలు రేటు నిర్ణయించిందని దీన్ని అమలు చేయాలని తహశీల్దారు కంపెనీ వారితో చర్చించారు. దగ్గరుండి అన్‌లోడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, విఆర్‌వో వెంకటేష్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అధికారిణికి సన్మానం

వ్యవసాయాధికారిణిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆరు సంవత్సరాలుగా రైతులకు సేవలందించిన అగ్రికల్చర్ అధికారిణి భారతీని బుధవారం ఉదయం అగ్రికల్చర్ కార్యాలయంలో బుచ్చినాయుడు కండ్రిగ ఉపసర్పంచ్ మునిరాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మునిరాజా మాట్లాడుతూ మండలంలో మహిళా అధికారిణి అయినప్పటికీ ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రతిరోజూ ఉదయం రైతులు వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని సకాలంలో వారికి కావలసిన సదుపాయాలు, అవసరాలను కల్పించారన్నారు. ప్రభుత్వ సబ్సిడీ పరికరాలను సకాలంలో మండలానికి తీసుకొచ్చి రైతులకు అందించడంలో ఆమె కృషి చేశారన్నారు. అగ్రికల్చర్ అధికారిణి భారతి మాట్లాడుతూ ఈ మండలంలో ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ తనకు అందరూ మంచి మిత్రులుగా, బంధువుల్లా కలిసి ఉన్నారని, ఎవరి వల్లా ఇబ్బందులు కలగలేదని గుర్తు చేసుకున్నారు. ఇక్కడి నుంచి నాగలాపురం మండలానికి వెళ్లిపోవడంతో తనకు చాలా బాధాకరంగా వుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది రేవతి, లావణ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఈచర్

వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ట్రాక్టర్‌ను ఈచర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన మండలంలోని నలగంపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు యాదమూరు మండలం సి ఆర్ కండిగ గ్రామానికి చెందిన బోడి రెడ్డి కుమారుడు మణి రెడ్డి (60) అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి ఇద్దరూ మామిడి లోడుతో బంగారుపాలెం వచ్చి తిరుగు ప్రయాణంలో వెళు తుండగా బెంగళూరు నుండి చెన్నై వెళుతున్న ఈచర్ ట్రాక్టర్ వెనుక భాగంలో ఢీకొంది. ఈ సంఘటనలో ట్రాక్టర్‌ను నడుతున్న మణిరెడ్డి రోడ్డుపై పడ్డాడు. ఈచర్ అతని తలపై దూసుకుపోవడంతో మణిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో వెంకటరెడ్డి ప్రమాదం నుండి బయటపడ్డాడు. ఈచర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. మణిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అంతర్ రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ :అంతర్రాష్ట్ర దోపిడీ దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక పోలీస్ పెరడ్ గ్రౌండ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ రేణిగుంట రోడ్డు లోని భార్గవి ఆటో మారుతి సుజుకి షోరూమ్‌కు కొందరు గుర్తు తెలియని దొంగలు షోరూమ్ వెనుక నుండి ప్రవేశించి షో రూమ్ కార్యాలంలో మేనేజర్ నోరు, చేతులు, కాళ్లు, కట్టి వేసి అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కుని , క్యాష్ కౌంటర్‌లో ఉన్న లాకర్‌ను తీసుకుని వెళ్లి అందులోని 5 లక్షల రూపాయల నగదు దొంగిలించుకుని వెళ్లారు. ఆ షోరూమ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. తిరుపతి సిసిఎస్ అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో తిరుపతి సిసిఎస్ డిఎస్పి శ్యామ్ సుందరం, ఇన్‌స్పెక్టర్లు వి చిన్న పెద్దయ్య, యన్. శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, ఎస్ ఐ ప్రదీప్ కుమార్ రెడ్డి, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి అనుమానితుల గురించి విచారించి వారి కదలికల పైన నిఘా పెట్టారని తెలిపారు. ఈ నెల11 తేది మధ్యాహ్నం 3 గంటలకు తిరుచానూరు బై పాస్ రోడ్డు, ఉప్పరపల్లి క్రాస్, వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ కాన్వాడ్ జిల్లా జూనాపని గ్రామానికి మంగళ్ సింగ్ చౌహాన్ (28)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.1,48,500 నగదు, ఒక బ్యాగును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై పలుపోలీసు స్టేషన్లో కేసులు ఉన్నాయని వెల్లడించారు. ఈ మేరకు నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నిందితుడు అరెస్ట్, సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

చిరుత దాడిలో దూడ మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: చిరుత దాడిలో దూడ మృతి చెందిన సంఘటన బుధవారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. చౌడేపల్లి పరిధిలోని గోసల గుర్రప్పల్లికి చెందిన కుమార్ అతని కుటుంబంతో సమీపంలోని అంకాలమ్మ కొండ వద్ద కాపురం ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వర్షం కురవడంతో పశువులను పాకలో కట్టేసి గోసలకూర పల్లికి వచ్చేశారు. తెల్లవారి వెళ్లి చూడగా ఆ దూడను చిరుత చంపి తిని వెళ్లి పోయింది ఈ మేరకు ఫారెస్ట్ అధికారిణి ఇంద్రాణి పంచనామా చేయగా పశు వైద్యాధికారి పవన్ పోస్టుమార్టం నిర్వహించి దూడను ఖననం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో రైతులందరూ చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారిణి ఇంద్రాణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

చిరుత దాడితో మృతి చెందిన దూడ

IN THE COURT OF ADDL, CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
O.S.No. 20 /2025

BETWEEN:-
Smt. G.Rukmini and others ...Plaintiffs.
AND:-
Smt J.T.Alimelu @ G.T.Alimelu and others ...Defendants.

SUMMONS TO THE DEFENDANTS No.1 & 4

To
D1: Smt J.T.Alimelu @ G.T.Alimelu, W/o Late G.T.Raman,
D4: G.T.Vinodh @ Dinesh, S/o Late. G.T.Raman, Defendants No.1 and 4 are residing at Door No.7-124, Navasandhu Street, Narayanavanam town & post, Narayanavanam Mandal, Tirupathi Dist.,

Please take notice that, the plaintiffs filed suit for partition of the plaint schedule mentioned property against you and others in the above Hon'ble court and the above suit is posted to 30/07/2025 for your appearance. So, pleased to be attend on 30/07/2025 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.

N.MURUGESHAN REDDY,
ADVOCATE, PUTTUR.

IN THE COURT OF ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
I.A.No. 18/2025, O.S.No. 20 /2025

BETWEEN:-
Smt. G.Rukmini and others. ....Petitioners/Plaintiffs.
AND:-
Smt J.T.Alimelu @ G.T.Alimelu and others ....Respondents/Defendants.

NOTICE TO THE RESPONDENTS/ DEFENDANTS No. 1 & 4:

To R1: Smt J.T.Alimelu @ G.T.Alimelu, W/o Late G.T.Raman,
R4: G.T.Vinodh @ Dinesh, S/o Late. G.T.Raman, Respondents/Defendants No.1 and 4 are residing at Door No. 7-124, Navasandhu Street, Narayanavanam town & post, Narayanavanam Mandal, Tirupathi Dist.,

Please take notice that, the petitioners/plaintiffs filed suit for partition along with the above Interlocutory application for permanent injunction in respect of the plaint schedule mentioned property against you and others in the above Hon'ble court and the above suit is posted to 30/07/2025 for your appearance. So, pleased to be attend on 30/07/2025 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.

Sd/ N. MURUGESHAN REDDY
ADVOCATE, PUTTUR.

మహారాజా శ్రీ గూడూరు7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ARBITRATION.O.P.No.42/2023
B. Umamaheswara Reddy ...Petitioner
Vs
1) H.D.F.C Bank Ltd.
2) K.C.Ramesh Kumar
3) Khadar Masthan shaikh ...Respondents
To.
K C RameshKumar, (R2), Sole arbitrator, Flat No:201#12-13-588/N, 2nd floor, Seetharama Residency, Lane No.12, Street No.14, Nagarjuna Nagar, Tarnka, Hyderabad-500017.

2వ రెస్పాండెంట్ నోటీసు నిమిత్తం

పైన తెలుపబడిన కోర్ట్ లో పై పిటిషనర్ ఆర్బిట్రేషన్ O.P దాఖలు చేసియున్నారు. ఆ పిటిషన్ నందు 2 వ రెస్పాండెంట్ కూ నోటీసు నిమిత్తం తేదీ 15-07-2025 వాయిదా వేసి ఉన్నాది. ఆ రోజు ఉదయం 10.30 నిముషాలకు పై కోర్ట్ నందు 2వరెస్పాండెంట్ ప్రత్యక్షము గాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెను ఉంది లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు, ఇది కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయడమైనది.

ఇట్లు
పిటిషనర్ తరపు న్యాయవాది
కందనూరు వెంకట కృష్ణయ్య
అడ్వకేట్, గూడూరు

నిరంతర యజ్ఞంగా టిటిడి అన్నప్రసాదం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టిటిడి నిరంతర యజ్ఞంగా అన్నప్రసాద వితరణ ఉచితంగా చేస్తోంది. 1985, ఏప్రిల్ 6న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతులమీదుగా టిటిడి ప్రారంభించింది. తదుపరి 1994, ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా, తర్వాత దీనిని శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా నామకరణం చేశారు. మొదటగా తిరుమలలో కల్యాణకట్ట ఎదురుగా గల పాత అన్నదానం కాంప్లెక్స్‌లో అన్నదానం జరిగేది. ఇప్పటి వరకు శ్రీ వైంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు దాతలు దాదాపు రూ. 2,190 కోట్ల విరాళాలను అందించారు. ఎందరో దాతలు ఇచ్చిన నిధులతో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ సాగుతోంది.

వ్యక్తిగతంగా దాతల పుట్టిన రోజు, దాతల కుటుంబ సభ్యుల పేర్లతో, దాతల ట్రస్ట్ లు, కంపెనీల పేరుతో రూ.44 లక్షలు అందించవచ్చు. శ్రీవారి పుట్టిన రోజు అయిన శ్రవణా నక్షత్రం, శ్రీ పద్మావతీ అమ్మవారి పుట్టిన రోజు అయిన ఉత్తరషాడ నక్షత్రం, పంచమితీర్థం, వైకుంఠ ఏకాదశి, శ్రీవారి, శ్రీపద్మావతీ అమ్మవారి ప్రత్యేక రోజులలో కూడా దాతలు విరాళంగా అందించవచ్చు. రూ. 44 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని టిటిడి కల్పించింది. విరాళం అందించే దాతల పేరును తిరుమల వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని డిస్ ప్లే బోర్డులో ప్రదర్శిస్తారు. అదేవిధంగా ఒకరోజు అన్నప్రసాదాలను వడ్డిస్తారు. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉదయం అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనం కోసం రూ.17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తారు. తిరుమల, తిరుపతి, ఒంటిమిట్టలోని టిటిడి అన్నప్రసాదాలు వితరణ కేంద్రాల నుండి రోజుకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు.

దాతలు రూ.44 లక్షలు అన్నప్రసాద వితరణకు విరాళం అందిస్తే, ఆ రోజంతా తిరుమలలోని మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్,

దాత రూ. 44 లక్షలతో రోజంతా అన్నప్రసాద వితరణ

వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1లోని 20, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ - 2లోని 31 కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని 9 కంపార్ట్ మెంట్లు, ఏటీసీ, ఎంబీసీ, టిబీసీ, పీఏసీ - 2, పీఏసీ - 4 కేంద్రాలు, శిలాతోరణం, కష్ణతేజ వరకు బయటి క్యూలైన్లు, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, శ్రీగోవిందరాజ స్వామి ఆలయ అన్నప్రసాదరణ వితరణ కేంద్రం, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటి ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనం, ఒంటిమిట్టలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేస్తారు. ప్రతి రోజూ టిటిడిలో అన్నప్రసాదాల తయారీ, పంపిణీకి సుమారు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అన్నప్రసాదాలు విభాగంలో పలువురు శ్రీవారి సేవకులు సేవలు అందిస్తున్నారు. తద్వారా భక్తులు నుండి టిటిడి అన్నప్రసాదం విభాగం విశేష ఆదరణ పొందుతోంది.

టన్ను మామిడికి రూ.8వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వం ప్రకటించినట్లు మామిడి పంటకు టన్నుకు రూ.8వేలు గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించకపోతే వారి లైసెన్స్‌ను రద్దు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. మామిడి రైతుల సమస్యలను తిరుపతి ఆర్‌డిఒ దృష్టికి బుధవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పి.హేమలత మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యం టన్ను ధర చెల్లించని పక్షంలో ఆయా ఫ్యాక్టరీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్‌చేశారు. దామలచెరువు మార్కెట్‌యార్డులో కేవలం నాలుగు, ఐదు రూపాయలు మాత్రమే రైతులకు ఇస్తున్నారన్నారు. ఎకరాకు రూ.15వేలు ఖర్చు అవుతుంటే, టన్ను 15వేలు ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని అన్నారు. ప్రభుత్వం 12వేలు ప్రకటించినా రైతులు సరేనని సర్దుకుపోతున్నారని, కానీ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు అన్యాయం చేసి, తాము లాభాలు గడించాలని చూస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యంతో మరోసారి చర్చలు జరిపి, నిర్ణయాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం నాయకులు భారతి, సుగుణ, పురుషోత్తంనాయుడు, రఘుపతినాయుడు, కృష్ణమూర్తి, రఘునాయుడు, హనుమంతరావు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో.. 'అంకితం.. నీకే అంకితం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రముఖ గాయకుడు పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని ఈనెల 14, 15 తేదీల్లో తిరుపతి మహతి కళాక్షేత్రంలో తిరుపతి ఫిలిం సొసైటీ, టిటిడి సహకారంతో " అంకితం.. నీకే అంకితం.. అనే పేరుపై ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన పాటలను మహతి ఆడిటోరియంలో ఆయన అభిమానులకు వినిపించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులు వైఎస్ బాబు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి ప్రముఖ సినీ నటి ఇంద్రజ హాజరవుతారని, వెండితెరపైనే కాకుండా బుల్లితెరపై కూడా ఎస్పీ బాలసుబ్రమణ్యం అనేక కార్యక్రమాలు చేశారని, పాడుతా తీయగా, స్వరాభిషేకం, పాడాలని ఉంది వంటి కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలకు గాయని గాయకులు ప్రవస్థి, ఉదయ భాస్కర్, నరసింహ, రేణు కుమార్, సురభి శ్రావణి, స్నిగ్ధ హాజరవుతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ ఇంచార్జి కార్యదర్శి సంతావాణి, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు కేరాఫ్ 'శ్రీబాబా విద్యానికేతన్'

ప్రజాశక్తి-తిరుపతి సిటి



పాఠశాలను ప్రారంభించి 32 ఏళ్లు అనుభవం కల్గి, నాటి నుంచి మేటిగా తిరుపతి నగర ప్రజలకు మారుతున్న విద్యా ప్రమాణాలతో నాణ్యమైన విద్యను బోధించి, విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలతో ఉన్నత లక్ష్యాలకు బాటలు వేస్తోందని శ్రీబాబా విద్యానికేతన్ అధినేత డాక్టరు ఎల్.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలోని జిఎస్‌ఆర్ లేఅవుట్‌లో ఉన్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 32 ఏళ్ల క్రితం ఈ పాఠశాలను ప్రారంభించినప్పుడు, పదుల సంఖ్యలో విద్యార్థులతో అడ్మిషన్ నిర్వహించామన్నారు. నేడు చాలా మంది విద్యార్థులకు వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరి జీవితంలో స్థిరపడ్డారని, ఇది చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. నిరంతరం శ్రమతో, అకుంఠిత దీక్ష, ఉత్తమ ప్రణాళికలతో పోటీ విద్యారంగంలో రాణించడం కఠోర కార్యచరణతో కూడుకున్నదన్నారు. పాఠశాల విద్యార్థులు వారి లక్ష్యాలను చేరువ అవ్వాలని దృఢసంకల్పంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025 సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా, తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచారన్నారు. ఈమ పాఠశాలలో విద్యతో పాటు సంస్కృత సాంప్రదాయాల్లో ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించి, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నేడు ఉన్న విద్యాప్రమాణాలకు రాబోవు రోజుల్లో పూర్తిగా టెక్నాలజీతో మనిషి జీవితం ముడిపడి ఉంటుందన్నారు. అంతేకాకుండా మంచి ఉద్యోగాలు కూడా ఈ రంగంలోనే రానున్నాయని అనడంలో అతిశయోక్తి లేదన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని తమ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అంచెలంచెలుగా కంప్యూటర్ శిక్షణ, స్కిల్‌డెవలప్‌మెంట్, స్పోకన్ ఇంగ్లీష్, ఇలా విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ప్రతి ఒక అంశాన్ని పాఠశాలలో అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. 2025 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఎస్.వేణు 589/600, వి.చస్మీతప్రియ 579, ఆర్.జయచంద్రన్ 574, ఎన్.గరీష్మా 572, కె.గీతిక 569, సి.విద్యశ్రీ 568, ఎస్.హనీషా 567, టి.సంగీత 561, సి.చరణ్ 543, డి.వైష్ణవి 540, కె.రాఘవేంద్ర 539, కె.కీర్తన 528, ఎస్.రమణీ 525, జి.తనూజ 519, ఎన్.ఉమాకీర్తి 517, కె.నవీన్‌రావ్ 517, వి.దీక్షిత్ 510, పి.బాలాజీ 506, కె.తరుణ్ 501, ఎస్.ఖాతీజ 497, ఎస్.హమీద్ 495, ఆర్.వైషు 483, పి.లోహిత్ 479, సి.చందు 475, టి.రీయాజ్ 473, ఎ.హర్షిత 467, డి.త్రివిక్రమ్ 459, టి.మనోజ్‌కుమార 435, ఎ.పురుషోత్తం 427, సిహెచ్.పృధ్వీ 425, ఐ.హశ్వంత్ 424, సి.సాత్వీక్ భరద్వాజ్ 410, ఎస్.హాఫీదా 395, ఆర్.చైతన్య 379, వి.మునిఉదయకుమార్ 355, యు.చరణ్ 322 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారన్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9866232640 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు...

- ఐఐటిలో ఉత్తమ శిక్షణ.
- దీర్ఘానుభవంతో ప్రత్యేక పర్యవేక్షణ.
- ఫలితాల్లో రాష్ట్రస్థాయి ప్రతిభ.
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం.
- ఆహ్లాదకరమైన వాతావరణం.

జాగ్రత వహిస్తే క్షయ వ్యాధి దూరం

ప్రజాశక్తి -రేణిగుంట

జాగ్రత్త వహిస్తే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సూపర్వైజర్ కామరాజు, టీబి సూపర్వైజర్ సుమశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకష్ణ నాయక్, జిల్లా కుష్టు క్షయ నివారణ అధికారి శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణం లోని బుగ్గ వీధి నందు ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లోహిత, ఆశా వర్కర్లు శంషాద్, జబీన్ పాల్గొన్నారు.

ఉచితంగా కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో రోటరీ క్లబ్ - స్విమ్స్ ఆసుపత్రి సంయుక్తంగా బుధవారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. పింక్ బస్సు ద్వారా మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు వందమంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. స్విమ్స్ కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, డాక్టర్ జి.హరిత, పీఆర్వో డి.చంద్రమోహన్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శైలజ, సెక్రటరీ సిద్ధులుగారి ప్రసాద్, క్లబ్ మెంబర్లు కంద్రిగ ఉమా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రగతికి... ప్రత్యేక ప్రణాళిక

విజన్-2029తో ముందుకు
పన్ను వసూళ్లకు జోన్ విధానం
విద్యుత్ ఆదాకు సోలార్ వ్యవస్థ

'ప్రజాశక్తి'తో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. విజన్-2029తో నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తి అభివద్ధి ప్రణాళికపై ఎమ్మెల్యే బొజ్జల 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే...

విజన్-2029తో ముందుకు

వచ్చే సాధారణ ఎన్నికల నాటికి శ్రీకాళహస్తి రూపురేఖలు మారుస్తాం. నియోజకవర్గంలో అభివద్ధి చెందని గ్రామాల జాబితా తయారు చేసి వాటిని ఏ బీ సీ విభాగాలుగా వర్గీకరిస్తాం. ప్రాధాన్యతల వారీగా ఈ ప్రాంతాల్లో అభివద్ధి పనులు చేపడతాం. పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా దినదినాభివద్ధి చెందుతున్న శ్రీకాళహస్తిని మరింతగా అభివద్ధి చేసేందుకు తుడా, కేంద్ర సాయాన్ని కోరనున్నాం. ఏరియా ఆసుపత్రి దారిని తుడా నిధులు రూ.15 కోట్లు వెచ్చించి విస్తరించనున్నాం. మున్సిపాలిటీలో స్లాబ్ ల వారీగా పన్నులు వసూలు చేసేందుకు రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్ లను ఏర్పాటు చేస్తున్నాం. రెడ్ జోన్ పరిధిలో ఉన్న పన్ను ఎగవేత దారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. గ్రీన్ జోన్ పరిధిలో ఉన్న వారిని ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సహిస్తాం. పున:ప్రతిపాదనలతో శివం టూ శివం రోడ్డును రూ. 37 కోట్లతో పూర్తి చేసి ఎస్టీపీ ప్లాంట్ కు మురుగు నీటి అనుసంధానం చేయనున్నాం.

కొండమిట్టలో ప్రత్యేక రోడ్లు, ప్రతి ఇంటికి తాగు నీరు అందిస్తాం. శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి విద్యుత్ భారం లేకుండా వీధి దీపాలకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తాం. మున్సిపాలిటీలో ఉన్న స్క్రాబ్ వాహనాలు విక్రయించి కొత్తవి కొనుగోలు చేస్తాం. కేంద్ర నిధులు రూ.23 కోట్లతో దక్షిణ కైలాస నగర్, శ్రీరామ్ నగర్ కాలనీలో మౌళిక వసతులు అభివద్ధి చేస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి స్కిట్ కళాశాలలో తరగతులు పున్ణ ప్రారంభం కానున్నాయి. జేఎన్టీయూ అనుబంధంగా మూడు కోట్లతో పనులు జరుగుతున్నాయి. స్వర్ణముఖి నది సుందరీ కరణ పనులు పూర్తి చేసి పర్యాటకం అభివద్ధికి తోడ్పాటు అందిస్తాం. అదేవిధంగా కన్నప్ప కొండ నుంచి దుర్గమ్మ తిప్పవరకూ రోప్ వే ఏర్పాటు చేస్తాం. మాస్టర్ ప్లాన్ అడ్డంకులను పూర్తిస్థాయిలో పరిష్కరించి శ్రీకాళహస్తీశ్వర దేవస్థానాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలబెడతాం.

ఆక్రమణలపై ఉక్కు పాదం

నేను ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే రాజీవ్ నగర్ అక్రమాలపై ఉక్కు పాదం మోపాను. ప్రత్యేక బందాలను విచారణకు పంపి నిజమైన లబ్ధిదారులు, నకిలీలను గుర్తించాం. త్వరలోనే నకిలీ పట్టాలను రద్దుచేసి ఆ స్థలాలను అర్హులకు అందజేస్తాం. అర్హులైన పాత్రికేయులకూ మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తాం.

అన్ని గ్రామాలకూ తారు రోడ్లు

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారు రోడ్లు ఉండేలా చొరవ తీసుకుంటున్నాం. ఇప్పటికే మూడు కోట్ల వ్యయంతో రేణిగుంట, తొట్టంబేడు మండలాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. మరిన్ని తారు రోడ్లను భవిష్యత్తులో నిర్మిస్తాం. కేటి రోడ్డును ఆరు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కూటమి ప్రభుత్వ పాలనలోనే మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి పనులు పూర్తయి ప్రారంభమైన సంగతి అందరికీ తెలిసిందే.

యువత ఉపాధికి పెద్ద పీట

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేపట్టినప్పుడు, యువగళం లోకేష్ పాదయాత్రలో యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని పరిశ్రమల్లో స్థానిక యువతకు 80 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని అసెంబ్లీలో సైతం మాట్లాడాను. అన్ని వేదికల పైన స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై గళం విప్పుతున్నాను. శ్రీకాళహస్తి ఇండస్ట్రియల్, ఎడ్యుకేషనల్ హబ్ గా మరింత అభివద్ధి పథంలో ముందుకు సాగేందుకు నా వంతు కషి చేస్తున్నా.. త్వరలో శ్రీకాళహస్తికి మరిన్ని పరిశ్రమలు, విద్యాసంస్థలు రానున్నాయి.

టిడిఆర్ బాండ్లు జారీ

మాట నిలబెట్టుకున్న 'కూటమి'
ప్రత్యేక 'మేళా'తో వెసులు బాటు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య నివారణకు గత వైసిపి ప్రభుత్వం తిరుపతి కార్పొరేషన్ పరిధిలో సుమారు 150 ఎకరాల భూమిని సేకరించి మాస్టర్ ప్లాన్ రోడ్లను వేసింది. అయితే భూములు కోల్పోయిన వారికి వైసిపి ప్రభుత్వం టిడిఆర్ బాండ్లు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో చాలామంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. భూములు తీసుకునేముందు వారి అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తారని హైకోర్టు మొట్టికాయ వేసింది. భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోర్టు తీర్పు వెల్లడించింది. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 1259 మందికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా. వైసిపి ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రం 70 మందికి టిడిఆర్ బాండ్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో చాలామంది బాధితులు కూటమి నేతల పై ఒత్తిడి తీసుకువచ్చారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి నేతలు మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన బాధితులకు టిడిఆర్ బాండ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో భూములు కోల్పోయిన బాధితులు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా టిడిఆర్ బాండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పలుమార్లు తిరుపతి వాసులకు టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, అటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దష్టికి తీసుకెళ్లారు. తిరుపతితో పాటు విశాఖపట్నంలో కూడా పెద్ద ఎత్తున టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వాటికి మార్గ నిర్దేశాలు జారీ చేసింది. అసెంబ్లీ సమావేశాల్లోనూ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు టిడిఆర్ బాండ్ల సమస్యలపై మాట్లాడారు. మున్సిపల్ పట్టణ అభివద్ధి శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసి అర్హులైన భూములు కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని కమిటీలో నిర్ణయించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన బాధితులను గుర్తించి, వారితో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు

టిడిఆర్ బాండ్లు దశలవారీగా ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం 300 మందికి ఇచ్చింది. మిగిలిన బాధితులకూ దశలవారీగా ఇవ్వడానికి ముమ్మరంగా టౌన్ ప్లానింగ్ అధికారులు రెవెన్యూ అధికారులను కలిసి పనిచేస్తున్నారు. మిగిలిన 500 మంది లబ్ధిదారులకు టిడిఆర్ బాండ్లు ఇవ్వడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొంతమంది భూములు కోల్పోయిన వారు సకాలంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు వారి రికార్డులు సమర్పించకపోవడం, ఆన్లైన్లో వారి పేర్లు ఎక్కించడంలో ఆలస్యం కావడం వల్ల మిగిలిన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వడానికి కొంత అంతరాయం ఏర్పడింది.

చాలామంది బాధితులు స్థలాలు తిరుపతిలో ఉండగా వారు నివాసం ఇటు అమెరికాలోనూ, అటు భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉండడంతో వారి అడ్రస్ లు తెలియకపోవడంతో కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో. గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.200 కోట్ల ఆస్తులు పంపిణీ

మాస్టర్ ప్లాన్ రోడ్లో భూములు కోల్పోయిన బాధితులు ఇప్పటివరకు 300 పైగా టిడిఆర్ బాండ్లు తీసుకున్నారు. సుమారు 200 కోట్లు విలువ చేసే ఆస్తులు టిడిఆర్ బాండ్ల ద్వారా కార్పొరేషన్ అధికారులు ఇచ్చారు. గత మూడు సంవత్సరాల నుంచి టిడిఆర్ బాండ్ల కోసం బాధితులు కార్యాలయం తిరిగి తిరిగి తిరిగి అలసిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారులకు గుర్తించి టిడిఆర్ బాండ్లను ఇస్తున్నారు. దీనికి సంబంధించి మూడు నెలల నుంచి టిడిఆర్ బాండ్ మేళా జరుగుతోంది. కొంతమంది తమ భూములు తమకు చెప్పకుండా తీసుకున్నారని కోర్టులో కేసు వేశారు. అలాంటివి కూడా ఎలా పరిష్కరించాలో దానిపై కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ చేపట్టారు.

హామీ ఇచ్చాం అమలు చేస్తున్నాం : ఎంఎల్ఎ

ఎన్నికల ముందు టిడిఆర్ బాండ్ల సమస్యలు బాధితులు మా దష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పాం.అధికారంలోకి వచ్చిన వెంటనే 300 మంది బాధితులకు అందజేశాం. మిగిలిన వారివి కూడా రికార్డులు పరిశీలించి అర్హులైన వారికి ఇస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం.

టిడిఆర్ బాండ్లు ఇస్తున్న కమిషనర్ మౌర్య (ఫైల్‌ఫోటో)

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ అభివృద్ధి సాధ్య మని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే పిచ్చాటూరు లోని టూ టౌన్‌కు చేరుకొని ఉపాధి పనుల ద్వారా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదికే గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం, పశువుల షెడ్డు, పశువుల తొట్టె, శ్మశానాలు నిర్మాణం వంటి పనులతో అభివృద్ధి చెందుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి ఇలంగో వన్ రెడ్డి, పద్దు రాజు, ఆయకట్టు చైర్మన్ రవి వాసు రెడ్డి , ఢిల్లీ బాబు, రవి, అధికారులు, తహశీల్దారు టీవీ సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లెలో గంగ జాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం వేకువ జామున గంగమ్మను ఊరేగించారు. మంగళవారం రాత్రి బంక మట్టితో గంగమ్మ ప్రతిమను ప్రతిష్ట చేశారు. బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంబల, డప్పులు వాయిస్తూ బాణాసంచా పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఆలయాధికారులు

ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మోహినీ అవతారం ఊరేగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి మర్యాదలు చేశారు. వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వడమాల పేట, జెడ్‌పిటిసి మురళి రెడ్డి, డిప్యూటీ ఈవో హరీంధ్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు..

క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : క్రికెట్ క్రీడలో గూడూరు పట్టణానికి చెందిన అనేకమంది రాణించారని చిన్నతనం నుండి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు చిన్నారులు కష్టపడాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల్లూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో 40 రోజులు నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్ కుమార్ శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గతంలో పలు మార్లు క్రికెట్ పోటీలు ముని గిరీష్ ఆధ్వర్యంలో నిర్వహిం చారన్నారు. గూడూరు క్రీడాకారులు జిల్లా స్థాయిలోనూ రాణించాలని స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి , దశరథ రామిరెడ్డి ,ముని గిరీష్ ,వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగేశ్వరరావు, లవ కుమార్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో నేషనల్ సమ్మర్ క్యాంప్ స్పోర్ట్స్ ముగిసింది. క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, రన్నింగ్ , యోగా, ఉచిత శిక్షణ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, పిడి నారాయణరాజు విచ్చేసి విన్నర్స్ కి మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు గూడూరు మున్సిపల్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లుకు బుధవారం సమ్మె నోటీసు అందించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 11 ది 17/1/2012 ఆధారంగా కేటగిరీలు నిర్ణయించాలని కోరారు. జీవోఎంఎస్ నెంబర్ 36, తేది 1/3/2024 ప్రకారం 21 వేలు నుండి రూ.24,500 జీతాలు పెంచి చెల్లించాలని డిమాండు చేశారు. జిఓఆర్‌టినెంబర్ 16 15, 2013 లో పేర్కొన్న విధంగా మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులకు పిఆర్‌సి జీతాలు, కరువు భత్యం ఐఆర్, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు అమలు చేయాలని కోరారు. 2018లో నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రాతపూర్వక ఒప్పందాలు అమలు చేయాలన్నారు. గత 17 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా పెంపు, దహన సంస్కారాలకు రూ.20వేలు, సంక్షేమ పథకాలు అమలు జీవోలు జారీ చేయడంతో పాటు రిటైర్మెంట్ అయిన, చనిపోయిన అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి, గ్రాడ్యుటి చెల్లించాలి, ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలని. పై డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమ్మె నోటీసులో తెలిపారు. లేని పక్షంలో సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, పిబాలాజీ, ఎస్‌గిరి, బి మురళి, ఏ ప్రసాద్, బి చంద్రయ్య పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో గూడూరు కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

ప్రశంసలు అందుకుంటున్న మేటి కళాకారుడు కిరణ్

నటనలో మేటి కళాకారుడు కిరణ్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపలంలో భారత వార్షిక మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి ద్రౌపది మాన సంరక్షణ (వస్త్రాపహరణం) అనే నాటకాన్ని వెంకటేశ్వర నాట్య కళామండలి సభ్యులు ప్రదర్శించారు. ఈ క్రమంలో మేటి కళాకారులు, మేనేజర్ బొమ్మయపల్లి కిరణ్ తన నటనతో ప్రేక్షకులను మెప్పించి పలువురి ప్రశంసలు పొందారు. మంగళవారం రాత్రి 9 గంటల నుండి ప్రారంభమైన నాటకం ఉదయం 5 గంటల వరకు చాలా ఆకర్షణీయంగా కళాకారులు నాటకం ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో నాటక ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు, కళాకారులను ఘనంగా సత్కరించారు.

తారు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని ఎలమంద రోడ్డు నుంచి ఎర్రవారిపాలెం క్రాస్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన తారురోడ్డును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్యల పరిష్కారానికి ఐదు కోట్లు కేటాయించి రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రారంభించి దశలవారుగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. తలకోన నుంచి వర్షపు నీరు వృథా కాకుండా మండలంలోని చెరువులకు మళ్లించే విధంగా అవసరమైన నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. మండల ప్రజలకు తాగునీరు, పంటలకు లోటు లేకుండా తలకోన నీరు చెరువులకు మళ్లించి కరువు లేకుండా చేయడానికి ప్రాజెక్టు కాలువల నిర్మాణాల కోసం రూ.20 కోట్లు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే నాని రాజీలేని కృషి చేస్తున్నారని ఆర్‌డివో రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఆర్ అండ్ బి మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రైతులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ దివ్యసుధా

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని బోడేవాండ్లపల్లి, ఉదయమాణిక్యం, యర్రావారిపాలెం పంచాయతీలలో రాస్ కెవికె ఆధ్వర్యంలో రైతులకు పంటల యజమాన్య పద్ధతుల పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ దివ్య సుధా మాట్లాడుతూ విత్తన శుద్ధి, విత్తనాలు ఎంపిక, కలుపు మొక్కల యాజమాన్యం గురించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. రానున్న ఖరీఫ్ సాగులో రైతులు వేసే పంటల రకాలు, పంటలు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష, పత్ర వినియోగం, వ్యవసాయ అనుబంధ రంగాలైన కోళ్ళు, గొర్రెలు పెంపకం, పశుపోషణపై సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుమంత కుండే రైతులకు వివరించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్, సిబ్బంది హరిత, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

14న ఆర్‌టిసి బస్ పాసుల జారీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి డిపో పరిధిలోని విద్యార్థులకు ఈనెల 14వ తేదీ బస్సు పాసులను జారీ చేస్తున్నామని డిపో మేనేజర్ ముని చంద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12, 13వ తేదీల్లో బస్సు పాసులు జారీ చేయడం లేదని వివరించారు. కొత్త బస్సు పాసుల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచిం చారు. పదో తరగతి పైబడి చదువులు చదివే విద్యార్థులు మార్కుల లిస్టును కూడా తమ వెంట తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

ఆధార్ అప్‌డేట్ కోసం పాట్లు

- పిల్లలు, తల్లిదండ్రులు పడిగాపులు
- పనిచేయని సర్వర్లు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్ కోసం రోజుల తరబడి పిల్లలు, వారి తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. రోజుల తరబడి ఎంపిడివో కార్యాలయం చుట్టూ తిరుగుతూ వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత ఆపరేటర్‌ను ప్రశ్నించగా సిస్టమ్స్ పనిచేయడం లేదని, సర్వర్ రావడం లేదని సమాధానం ఇస్తున్నాడని వారు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పిల్లలు, వారి తల్లిదండ్రులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే ఆధార్ అప్‌డేట్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం నిరీక్షిస్తున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు

రోడ్లపైనే చెత్త

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- పొంచివున్న రోగాలు
- స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో చెత్తకుండీ నుండి రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పడివుంది. 14 వార్డు షాపువీధి, గేట్ పుత్తూరు, ఎన్జీవో కాలనీ, పలు ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై చెత్త పేరుకుపోతోంది. పట్టణ ప్రజలు పలుసార్లు మున్సిపల్ శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెత్త కుళ్లి దోమలు చేరి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి వల్ల వార్డు ప్రజలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. పారిశుధ్యం లోపించినా మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా ఏమాత్రం ప్రయోజనం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ఇక ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

రహదారిపై పడిపోతున్న చెత్త

రోడ్డుపై నిండిపోయి కింద పడిపోతున్న చెత్త

పది రోజులుగా చెత్తకుండీ పొర్లుతోంది

14 వార్డులో గత పది రోజులుగా రెండవ వార్డుకు చెందిన చెత్తను ఒకే చోట వేయడంతో చెత్తకుండీ నుండి పొర్లుతున్నాయి. మున్సిపల్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు..

బాబు, షాపుకి వీధి, పుత్తూరు.

పారిశుధ్య పరిరక్షణలో విఫలం

ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం.. అయినా ప్రజలకు సేవలు అందించడంలో మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. పారిశుధ్యం పూర్తిగా లోపించింది..

- నాగరాజు, షాపువీధి, పుత్తూరు.

ఏనుగువాడ రహదారికి మోక్షం ఎప్పుడు.?

సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - ఓజిలి : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన గ్రామాల రహదారులు ఏర్పాటు చేయడంలో ఇటు రాజకీయ నాయకులు అటు పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని సిపిఎం నాయకులు శివకవి ముకుంద అధికారులపై మండిపడ్డారు. ఆ గ్రామ ప్రజలను సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ ఓజిలి మండల పరిధిలోని ఏనుగువాడ గ్రామం గత కొన్ని సంవత్సరాల నుండి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని శాశ్వత రహదారి ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఏనుగువాడ గ్రామంలో సుమారు వందమంది గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయని , వైద్యం ,విద్యతో పాటు అత్యవసర పరిస్థితిలో ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఉన్న రహదారి కాస్త గుంతల మయంగా ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గిరిజనులు పడుతున్న సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సంతకాల సేకరణ చేపట్టి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు వాడ గిరిజనులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన ఏనుగువాడ గిరిజనులు

మా భూమిని కబ్జా చేస్తున్నారు..!

న్యాయం చేయాలని బాధితురాలి వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పేరూరు గ్రామ పంచాయతీలో తాము కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్న భూమిని అక్కడి పంచాయతీ పాలకవర్గానికి సంబంధించిన నాయకులు దౌర్జన్యంగా కబ్జాకు యత్నిస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు మాధవీలత విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి మాధవిలత మాట్లాడుతూ 1996లో పేరూరు గ్రామ పంచాయతీ లెక్కదాకాల సర్వేనెంబర్ 529/4ఏ లో 30 సెంట్లు భూమిని శివప్రసాద్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేశామన్నారు. నేటికీ ఈ భూమి తమ స్వాధీన అనుభవం లోనే ఉందని, కానీ వేరొక సర్వేనెంబరుకు సంబంధించిన వ్యక్తులు తమ స్థలం ఇదేనంటూ కబ్జా చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తమ స్థలానికి సంబంధించి పంచాయతీ పన్నులు, విద్యుత్ మీటర్లు కూడా మంజూరు అయ్యాయన్నారు. తమ స్థలానికి ఆనుకుని భూమి కలిగిన రాజేంద్రనాయుడు కొంతమంది రౌడీ మూకలను పోగుచేసి గతంలో తాము నిర్మించిన షెడ్లను దౌర్జన్యంగా కూల్చివేశాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టులో కూడా వ్యాజ్యాలు నడిచి తమకు అనుకూలంగా కోర్టు వారు తీర్పును ఇచ్చారని తెలిపారు. అయితే తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు, ఆ గ్రామ పంచాయతీ సర్పంచి, మరికొందరు వైసిపి కీలక నాయకులు వచ్చి తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కష్టించి కూడబెట్టిన ధనంతో స్థలాన్ని కొనుగోలు చేస్తే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని గొప్పలు చెబుతూ తిరిగే నాయకులు ఇలా ప్రజలకు సంబంధించిన ఆస్తులను కొల్లగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ, చంద్రగిరి ఎమ్మెల్యే వెంటనే స్పందించి పేరూరు పంచాయతీలో జరుగుతున్న అరాచకాలను కట్టడి చేసి తమ భూమిని కాపాడి తమకు స్వాధీనం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాధవీలత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాధితులు

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి-చౌడేపల్లి: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన చౌడేపల్లిలో బుధవారం చోటు చేసుకుంది ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మండల కేంద్రమైన చౌడేపల్లి పట్టణంలోని బజారు వీధిలోని అమరనాథ్ కుమారుడు అమరావతి విశ్వతేజ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీ విద్యార్థి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో విద్యార్థి తండ్రి అమరనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి విశ్వతేజ (ఫైల్‌ఫొటో)

ముగిసిన గంగ జాతర

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

మండలంలోని బంగారుపాల్యం, మొగిలి వెంకటగిరి, జంబువారిపల్లి దళితవాడలో గుండ్ల కట్టమంచి గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహించిన గంగజాతర బుధవారం ముగిసింది. సాయంత్రం గంగమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

స్కూటరులో ప్రవేశించిన నాగుపాము

స్కూటర్‌లో నాగుపాము

ప్రజాశక్తి- చౌడేపల్లి:

ఓ నాగు పాము ద్విచక్ర వాహనంలో ప్రవేశించి అందరిని భయభ్రాంతులకు గురి చేసింది స్కూటరిస్టు కథనం మేరకు... పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రానికి చెందిన మునిరత్నం తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు వాహనం వద్దకు వచ్చాడు. అయితే అప్పటికే నాగుపాము వాహనంలోకి ప్రవేశించి ఉండడాన్ని గమనించిన అతను కేకలు పెడుతూ పరుగులు తీశాడు. స్థానికులు వచ్చి నాగుపామును అక్కడి నుంచి తరిమి వేశారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కుమారస్వామి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కుమారస్వామికి పలువురు నివాళి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

బైరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ బైరెడ్డిపల్లి పట్టణంలో కుమ్మర వీధిలో వుంటున్న అందరికీ ఆప్తుడైన కుమారస్వామి వడియార్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎం కృష్ణమూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ గౌడ అక్కడికి చేరుకొని కుమారస్వామి వడియార్ భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలివ్వాలి

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో... 'ఫెడరేషన్' ధర్నాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్

జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే అర్హులైన పేదలకు మూడు సెంట్ల ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో 'డిమాండ్స్ డే' పురస్కరించుకుని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ధర్నాలు జరిగాయి. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న మూడు సెంట్ల స్థలాన్ని అర్హులైన పేద జర్నలిస్టులకు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, వేజ్‌బోర్డు ప్రకారం వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు.

చిత్తూరులో..

తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో జిల్లా అధ్యక్షులు శ్రీధర్, తిరుపతి అధ్యక్షులు వాణి మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లో ఉండే జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను అర్హులైన అందరికీ ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా చిన్న పత్రికలకు అక్రిడేషన్ కార్డుల సంఖ్య పెంచాలని కోరారు. రిటైర్ అయిన జర్నలిస్టులకు తమిళనాడు తరహాలో పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎస్.గౌస్, తులసికుమార్, వెంకటేష్, శేఖర్, సుబ్బరాయుడు, జయపాల్, నరసింహులు, హనుమంత్‌రెడ్డి, వరదరాజులు పాల్గొన్నారు.

చిత్తూరు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఇంటిస్థలాలు కేటాయించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు

తిరుపతిలో..

చేయాలని, జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఫెడరేషన్, ఎపిబిజెలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జయరాజ్, జిల్లా అధ్యక్షులు ప్రకాష్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జయచంద్ర, జిల్లా నాయకులు కృపానందరెడ్డి, దినేష్, యోగేవందర్‌రెడ్డి, కేశవులు, బాలసుబ్రమణ్యం, నాగరాజు పాల్గొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, మురికి నీటి కాలువలు కల్పించడంతోనే గ్రామాల అభివద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. బుధవారం చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో సిమెంట్ రోడ్లు, తాగునీటి ట్యాంకు, పైప్ లైన్లను ఆయన ప్రారంభించారు. అభివద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి స్థానిక టిడిపి నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రగిరి నియోజకవర్గంలో అభివద్ధిని పరుగులు పెట్టిస్తున్నానన్నారు. సి రామాపురం పంచాయతీ, కోదండ రామాపురంలో పల్లె పండుగ కార్యక్రమంలో రూ. 10 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. చంద్రగిరిలో ద్వారకా నగర్, బీడీ కాలనీ వాసులకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ పైప్లైన్ ప్రారంభోత్సవం చేశారు. చంద్రగిరి గ్రామపంచాయతీలో మూడు కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047 తో రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఎస్ చైర్మన్ వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా, జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మేకల తిరుమలరెడ్డి, ఎన్ చిన్నబాబు, కే నరసింహారెడ్డి, తహసిల్దార్ కే వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరమ్మ పాల్గొన్నారు.

మంగళంలో మరింత అభివృద్ధి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి మంగళం ప్రాంతాన్ని మరింత అభివద్ధి పథంలో నడిపిస్తానని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. బుధవారం మంగళం పరిధి తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబీఆర్ నగర్ లో 20 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన కల్వర్టు బ్రిడ్జిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గతంలో కేబీఆర్ నగర్ లో వర్షం పడితే చాలు కాలనీ మురుగునీటి ప్రవాహంతో ఇక్కడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడేవారని, హామీలు ఇవ్వడమే కాదు, దాని నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. కేబీఆర్ నగర్ కు నూతన రోడ్డు మార్గాన్ని నిర్మించడానికి పంచాయతీ రాజ్ అధికారులను అంచనాల తయారు చేయాలని ఆదేశించారు. చెన్నాయిగుంట గ్రామంలో 37 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ నాయకులు ఈశ్వరయ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి చెన్నరాయప్ప, ఎంపీడీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ మండల తహశిల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతి సహాయ సంచాలకులుగా ఎన్.వేలాయుధం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి సహాయ సంచాలకులుగా ఎన్. వేలాయుధం బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం తిరుపతిలోని స్థానిక కలెక్టరేట్లో ఉన్న నాలుగో అంతస్తులో ఉన్న సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో సహాయ సంచాలకులుగా ఎన్.వేలాయుధం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తిరుపతి, రాజంపేట, అనంతపురం ప్రాంతాలలో సమాచార పౌర సంబంధాల కార్యాలయాలలో డివిజనల్ పిఆర్‌ఓగా విధులు నిర్వహించారు. అనంతపురం, సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిపిఆర్‌ఓ పదవులు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఏ డి (డిపి ఆర్ ఓ)పదవులు నిర్వహిస్తూ, ఇటీవల ప్రభుత్వ బదిలి ఉత్తర్వులు మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమంస్ శుక్ల ఉత్తర్వులు మేరకు బుధవారం తిరుపతి, సహాయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టారు.

బడికి వేళాయే...

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆడుతూ పాడుతూ సెలవులను సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి ఆటలకు సెలవు ఇచ్చి పుస్తకాలు పట్టుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరిట ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, స్కూల్ బ్యాక్ కిట్లను విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుండి అందజేయాలని విద్యాశాఖను ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి మిత్ర సామగ్రిని ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాలకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా సరఫరా చేశారు.

విద్యార్థులకు అందించే విద్యా సామగ్రి కిట్టు పక్కదారి పట్టకుండా ఏడాది బార్ కోడ్ విధానం ద్వారా అందించనున్నారు. విద్యార్థి ఆధార్ నెంబర్, ముఖచిత్రం క్యాన్ చేసి విద్యా సామగ్రి కిట్‌ను అందజేయాల్సి ఉంటుంది. విద్యార్థిని వయసును బట్టి మూడు రకాల స్కూల్ బ్యాగులను అందించనున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యా కిట్స్‌లో మూడు జతల యూనిఫాం, స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, షూస్, సాక్స్ ఉంటాయి.

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు 2,463 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,48,430 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు నోట్ బుక్స్, డిక్షనరీలు అన్ని పాఠశాలకు ఇంకా సరఫరా కాలేదు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ అవసరమైన విద్యా సామగ్రి కూడా అరాకొరగా అందినట్లు సమాచారం. విద్యా సంవత్సరం రోజైన గురువారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం నుండి సరఫరా కావాల్సిన విద్యాసామగ్రిని పూర్తిస్థాయిలో పంపిణీ చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా

షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న హర్షిత

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు టీకేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థిని బి.హర్షిత ఏపీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా స్టేట్ టాపర్‌గా నిలిచి షైనింగ్ స్టార్ అవార్డును తన తల్లిదండ్రులతో కలిసి అందుకున్నారు. తవణంపల్లి మండలం గాజులపల్లి చెందిన ఒక సాధారణ ట్రాక్టర్ డ్రైవర్ టి.రవి లక్ష్మమ్మ కుమార్తె హర్షిత పలమనేరు టీకేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్యా కోర్సులైన డైరీ సైన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 1000 మార్కులకు గాను 971 మార్కులు సాధించి స్టేట్ టాపర్ గా నిలిచినందుకు ప్రభుత్వం తరపున షైనింగ్ స్టార్ అవార్డు ప్రధానం చేయడం జరిగినదని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కన్నయ్య బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత హర్షిత మాట్లాడుతూ తాను మొదటి నుంచి తన తల్లిదండ్రులు పడుతున్నటువంటి కష్టాలను చూసి ఎలాగైనా కష్టపడి చదివి మంచి ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో చదివినట్లు తెలిపారు. పదవ తరగతి కూడా జవహర్ నవోదయాలో చదివి 440 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తన విజయానికి కారకులైన తల్లిదండ్రులకు బంధువులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

తేజశ్రీని అభినందించిన కమిషనర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణం జయప్రకాష్ రోడ్డులో నివాసముంటున్న తేజశ్రీని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీ మంగళవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 16వ తేదీ విశాఖపట్నంలో జరగబోవు రాష్ట్రస్థాయి యోగా పోటీలలో తేజశ్రీ పాల్గొన్నట్టు తెలిపారు. యోగ శిక్షకురాలు పవిత్ర, తేజశ్రీ తల్లి శ్యామల పాల్గొన్నారు.

డిపిఆర్ఓ వేలాయుధంకు అభినందనలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ)గా వేలాయుధం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా బుధవారం డిపిఆర్ఓ కార్యాలయంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జయరాజ్, ప్రకాష్, జయచంద్ర, కేశవులు, బాలసుబ్రమణ్యం, కృపానంద రెడ్డి, దాము, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

సర్వసభ సమావేశంలో ప్రజాప్రతినిధులు

సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- చౌడేపల్లి: అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిపాలన భవనంలో ఎంపీపీ గాజుల రామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంవత్సర కాలంగా మండలంలో పలు సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని అధికారులు అందుబాటులో ఉండి వాటి పరిష్కార మార్గం వైపు దృష్టి సారించాలని కోరారు. స్థానిక ఆసుపత్రిలో సిబ్బందిని నియమించి ప్రజాఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మండలానికి మరిన్ని వేరుశనగ విత్తనాలు తీసుకొచ్చి రైతులకు పంపిణీ చేయాలన్నారు. అలాగే మండల అభివృద్ధిలో ఎంపీటీసీ సర్పంచులు భాగస్వాములోని అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి నరసింహులు యాదవ్ అధికారులను కోరారు. అనంతరం ఆయా శాఖ అధికారులు వారి పనితీరును సభలో వివరించారు. ఎంపీడీవో లీలా మాధవి, సర్పంచుల సంఘు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహశీల్దార్ హనుమంతు, ఎంఈఓ కేశవరెడ్డి, వ్యవసాయ అధికారిని జ్యోతమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'శ్రీ వివేకానంద' విజయ దుందుభి

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలంలోని సాయిబాబా టెంపుల్ ఎదురుగా వున్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలోని విద్యార్థులు మొదటి, ద్వితీయ జిల్లా స్థాయి మార్కులు సాధించారు. ఈ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో అఫ్సా అంజుమ్ 453/470, నూర్ షావలి 445/470, బారీర అంజుమ్ 438/470 మార్కులు సాధించారు. బైపీసీలో అంజలి 403/440, విష్ణు 403/440 మార్కులు సాధించారు. సిఈసిలో సి, మౌనిక 437/500, ఎస్ దివ్య 422/500, బి హేమాశ్రీ 421/500 మార్కులు సాధించారు. ఒకేషనల్ గ్రూపులో ఎన్ గణేష్ 474/500, పి దివ్యశ్రీ 471/500, ఎం హిమబిందు 457/500 మార్కులు పొందారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్. మల్లికాఖానమ్ 984/1000, టి. లహరిక 971/1000, ఎస్. సహిస్తా 947/1000 మార్కులు సాధిం చారు. బైపీసీ గ్రూపు లో ఐ గుణశ్రీ 920/1000 ఎం. పావని 902/1000 మార్కులు సాధించారు. సిఈసి బి ఇందు 884/1000, జి ఆర్ మహేంద్ర

871/1000, ఏ అను 852/1000 మార్కులు పొందారు. ఒకేషనల్ గ్రూపులో జి ప్రతాప్ 865/1000, ఆర్ హేమంత్ 848/100, పి భాను ప్రసాద్ 822/1000 మార్కులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి సహకరించిన అధ్యాపక బృందానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ జి శ్రీనివాసులు నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

మదర్ థెరిసా కళాశాల విద్యార్థులకు స్టేట్ ర్యాంక్

ప్రజాశక్తి -గంగవరం: మదర్ థెరిసా విద్యా సంస్థల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర బాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ సాయి బృందా వెయ్యి మార్కులకు 990 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. బైపిసి ధనలక్ష్మి 979 మార్కులు సాధించి టౌన్ టాపర్, ఫాతిమా సిఇసి 957 టాపర్‌గా నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో డి హరిత ఎంపీసీ 470 మార్కులకు 466 , సహిత బైపిసిలో 440కి 432 మార్కులు, నిర్మా సైదా 500కు 487 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని కళాశాల మొత్తంలో అధిక స్థాయిలో విద్యార్థులు పాస్ అయినందుకు విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

'ఇంపల్స్' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి -పుంగనూరు: పదవ తరగతి ఫలితాల్లో ఇంపల్స్ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఇంపల్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారని చెప్పారు. డి ఇందు వర్షిని 600 మార్కులకు 590 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.అబ్ధిజ వర్ష 589, బి నాగ జస్మిత 589 మార్కులను సాధించి మొదటి ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా నిలిచా రన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడం లో పాఠశాలలో చక్కని ప్రణాళిక, బోధన కారణమని తెలిపారు. తల్లిదండ్రుల సమక్షంలో స్కూల్ టాపర్స్ ను ఉపాధ్యాయ బృందం అభినందిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో విడుదలైన జేఈఈ- ఐఐటీ మెయిన్స్ లో కూడా ముగ్గురు విద్యార్థులు 98 పర్సంటేజీ సాధించా రని చెప్పారు. ఈ ఏడాది విడుదలైన నవోదయ ఫలితాల్లో అర్బన్- ఓపెన్ - కేటగిరి నుండి వై దీపిక ఎంపిక కావడం కూడా ఇక్కడ బోధన సంకేతమని చెప్పారు.

'విద్యానికేతన్' విద్యార్థినికి స్టేట్ 5వ ర్యాంక్

ప్రజాశక్తి- వి కోట

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రమైన వికోటలోని విద్యానికేతన్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంపీసీలో లోధీ నఫీసా అలీఖాన్ 463/470 మార్కులు సాధించి మండలంలో మొదటి ర్యాంకు, రాష్ట్ర వ్యాప్తంగా 5వ ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దామోదర్ రెడ్డి అభినందించారు. అదేవిధంగా స్థానిక వాణి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ గ్రూపు విద్యార్థిని దర్శిని 982/1000, బైపిసి గ్రూప్‌లో అంకిత 940/1000 సాధించారు. ఇదే కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో మునీరా 435/500 స్టేట్ 3వ ర్యాంకు, సీఈసీ గ్రూప్‌కి చెందిన హారిక 487/500 స్టేట్ 2వ ర్యాంక్ సాధించారు. కళాశాల చైర్మన్ డిఆర్.బాలగుర్నాథ్ విద్యార్థులను అభినందించారు.

లోధీ నఫీసా అలీఖాన్

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన

జర్నలిస్టు చట్టాన్ని పునరుద్ధరించాలి

ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ 1955 వేతన సవరణ చట్టం 1958ను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎట్టేరి దేవరాజులు, గౌరవ సలహాదారులు కేఎం. ప్రేమ్‌చంద్, సభ్యులు తహశీల్దార్ కార్యాలయంలోని ఎమ్మార్వై ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 కార్మిక చట్టాలలో జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు ఉన్నాయని, అన్ని విభాగాల్లోని జర్నలిస్టులను ఒకే గొడుగు కింద తెచ్చే విధంగా వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని అమలు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేస్తుంటే ఆ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయడం దారుణమన్నారు. వేతనాలకు సంబంధించిన 1958 వేతన సవరణ చట్టాన్ని కూడా రద్దు చేయడం జర్నలిస్టులకు కనీస వేతన సౌకర్యం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులు కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో వారిని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు వారి కడుపు కొట్టే విధంగా చట్టాలను రద్దు చేయడం శోచనీయమన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కి నల్ల చట్టాలను తీసుకొస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కొరకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజెఎఫ్ సభ్యులు

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ

డిప్యూటీ డైరెక్టర్‌గా వేలాయుధం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వేలాయుధం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరికి పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు బుధవారం పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మొండివెంగనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి.తిరుమలయ్య, బ్రాహ్మణపల్లి గ్రామకమిటీ అధ్యక్షులు కోదండరెడ్డి, వ్యవసాయ సిబ్బంది దయాకర్, సుబ్రహ్మణ్యం, శాంతమ్మ తెలిపారు.

మధు అండ్ శ్రీవాణి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -గంగవరం: 2025 ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫరీక్షా ఫలితాలలో మధు అండ్ శ్రీవాణి విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని ఆ కళాశాల చైర్మన్ కే కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలలో ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ఎం. చేతన 988 / 1000, ఎస్ కరిష్మా 986/1000 , బుష్రా ఫాతిమా 985 / 1000 మార్కులు సాధించారని తెలిపారు. బైపిసిలో ఎస్. అల్బిఇన్ 987 / 1000 , రోషిని 986 /1000 , జయశ్రీ 985/1000 మార్కులు పొందారన్నారు. సిఇసి లో ఎస్ ఫిజా అంజుమ్ 970/1000 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కే సానియా 463/ 470, కే సుచరిత 461/470 , ఆర్ యశశ్రీ 460 /470, రిజ్వానా 460 / 470 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీలో జి. సమీరా 431 / 440, సాజియా 428 / 440 మార్కులు పొందారని తెలిపారు. సిఈసిలో పి ప్రీతి 488 / 500 , టీఎస్ ఫాతిమా 482/500 మార్కులు సాధించారన్నారు. ఎంఇసిలో కవిత 486 /500, కాజల్ 480/500 మార్కులు సాధించారు. ఈ ఫలితాలలో ద్వితీయ సంవత్సరంలో 900 పైగా 55 మంది విద్యార్థులు, ప్రథమ సంవత్సరంలో 400 పైగా 66 మంది విద్యార్థులు సాధించారు. ఇంతటి విజయానికి కారకులైన విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను,అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సిపి శ్రీవాణి అభినందించారు.

నేటి నుంచి ర్యాంప్, మండీల ద్వారా మామిడి కొనుగోలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఈనెల 12వ తేదీ నుంచి ర్యాంప్, మండీలు వారు మామిడి కొనుగోలు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డిలతో కలిసి ర్యాంప్, మండీలు ద్వారా మామిడి కొనుగోలు అంశాల పై ర్యాంప్, మండీల వ్యాపారస్తులు, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుండి ర్యాంప్, మండీలు వారు మామిడి కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. ర్యాంప్, మండీల వ్యాపారస్తులు తప్పని సరిగా మార్కెట్ ఏడీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే మామిడ ికాయలు కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపూరి మామిడికి మద్దతు ధర ప్రకటించిన దీన్ని పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా ర్యాంప్, మండిల వ్యాపారస్తులు సహకరించాలన్నారు. ర్యాంప్, మండీల వారు ఏ రైతుల నుండి ఎన్ని టన్నుల కొనుగోలు చేశారు. రైతు పేర్లు మామిడికాయల లారీలు ఏ కంపెనీకి లేదా ఇతర రాష్ట్ర లకు వెళుతున్నా అంశాలను, ప్రాసెసింగ్ కంపెనీ వద్ద షిఫ్ట్‌లు వారీగా విధులు నిర్వహిస్తున్న ఇన్చార్జిలను నియామకం చేయడం జరుగుతుందని అందులో ఒకరు కచ్చితంగా ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ఉన్న సమయంలో ఆ ప్రాసెసింగ్ కంపెనీ వద్దకు అందిన రైతుల పూర్తి వివరాలలో గ్రామం, మండల వాహనం నెంబరు, క్వాంటిటీ, ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు సంబంధిత ఫోన్ నంబర్లను ప్రొఫార్మాలో పూర్తి వివరాలను ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పర్యవేక్షణను నియామకం కాబడ్డ ఉద్యాన, వ్యవసాయ, ఏపిఎంలు, ఏపీఓలు నమోదు చేయాలన్నారు. ప్రాసెసింగ్ కంపెనీలు రూ.8లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రైతులకు ప్రోత్సాహకంగా రూ.4లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ర్యాంప్, మండి వ్యాపారస్తులు మాట్లాడుతూ లారీల బడుగుల, కూలీలు రేట్లు ఎక్కువగా ఉన్నాయని దానికి అనుకూలంగా రేటు ఇవ్వాలని కలెక్టర్ దృష్టి తీసుకురాగా మీ సమస్యలన్నింటినీ నోట్ చేసుకోవడం జరిగిందని లారీల బాడుగులు కూలీల రేట్లుకు సంబంధించి అనాలసిస్ చేసిన తర్వాత మీతో చర్చించడం జరుగుతుందని కలెక్టర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ పరమేశ్వర రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, ర్యాంప్, మండీల వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాంప్, మండీ వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ కేవైసీ పూర్తి చేస్తేనే..

రైతులకు అన్నదాత సుఖీభవ..

ప్రజాశక్తి- పెద్దపంజాణి: భూమి కలిగిన రైతులందరూ ఈ కేవైసీ తప్పకుండా చేసుకోవాలని, చేసుకున్న వారికే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారిని రఖీబా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి రైతు సేవ కేంద్రాల పరిధిలో ఇది వరకే ధ్రువీకరణ పూర్తి చేయడం జరిగిందని, ధ్రువీకరణ పూర్తి అయ్యాక తుది జాబితా రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉందని, తుది జాబితాలో పేర్లు ఉన్న ప్రతి రైతు విధిగా తమ భూమి ఉన్న రైతు సేవ కేంద్రాల పరిధిలో రైతు వెళ్లి తప్పకుండా వేలిముద్ర వేసి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈనెల 13 చివరి తేదీ అని, చాలా మంది రైతులు అపార్ ఐడిలు చేసుకోలేదని రైతు సేవ కేంద్రంలో సంప్రదించి రైతులు ఐడిలు క్రియేట్ చేసుకోవాలని సూచించారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్టు సర్పంచ్ ఉషశ్రీ తెలిపారు. బుధవారం మండలంలోని తుంబపాల్యం పంచాయతీలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ కార్యక్రమం సచివాలయ వ్యవసాయ అధికారి శ్వేత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఉషశ్రీ మాట్లాడుతూ రైతులకు ప్రతి సంవత్సరం రాయితీతో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, విత్తనాలు తీసుకున్న రైతులు భూముల విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోదండ యాదవ్, ఉప సర్పంచ్ చిరంజీవి, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, రైతులు విజయభాస్కర్, గురుస్వామి యాదవ్, మునిరాజులు, పెరుమాళ్ నాయుడు, రజిని యాదవ్ పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం అర్జునుని తపస్సు భక్తులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా ఆమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. 11 గంటల నుంచి అర్జున వేషదారుడు మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ తనతో తీసుకెళ్ళిన నిమ్మకాయలు, వీభూతి, పుష్పాలను భక్తులపైకి విసురుతూ తపస్సుమాను అధిరోహించారు. ఈశ్వరుని కోసం అర్జునుడు చేసిన తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా భాగతారిణి భారతి గాత్రకచ్చేరి నిర్వహించారు. అంతకు ముందు శివ పార్వతులను నంది వాహనంపై ప్రతిష్ఠించి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమానికి బట్టువారిపల్లి గ్రామానికి చెందిన కనకదుర్గా కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కొల్లాగుంట గ్రామానికి చెందిన డాక్టర్ మునికుమార్, జ్యోతి దంపతులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

అన్నదాతల పండుగ 'ఏరువాక పౌర్ణమి'

కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే

పొలంలో దుక్కి దున్నుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలం, ఏ. గొల్లపల్లి వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కే మురళీమోహన్ పొలంలో దుక్కిదున్ని లాంచనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే పొలంలో దుక్కిదున్ని వేరుశనగ విత్తనాలను విత్తడం జరిగింది. అంతకు ముంగు పొలంలో పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని, దేశ ప్రగతి మొత్తం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంటుందని అందుకే మన దేశంలో ఎన్నటికీ రైతే రాజు అని అన్నారు. అలాంటి అన్నదాతలకు ప్రత్యేకమైన పండుగ ఏరువాక పౌర్ణమి అని తెలిపారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజును మనం ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అంతేకాకుండా ఏరువాక పౌర్ణమి సహజంగా కర్షకుల పండుగ అని, భూదేవిని నమ్ముకొని పంటలు పండించే రైతులు వర్ష రుతువు ఆరంభంలో తొలకరి చినుకు కోసం ప్రార్థిస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఏరువాక పౌర్ణమి రోజును వేడుకగా జరుపుకుంటారని తెలిపారు.

అన్నదానం

బంగారుపాళ్యం: పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం మండలములోని మాధవనగర వద్ద గల బ్రహ్మానంద ఆశ్రమంలో సత్యనారాయణ పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి, గ్రామస్తులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

ఇంటి తిరిగి వెళుత్తున్న మహిళలు, సిబ్బంది లేక పనుల కోసం పడిగాపులు పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

సచివాలయ సిబ్బంది పోటీ పరీక్షల నిమిత్తం సెలవులు పెట్టడం వలన సచివాలయంలో రేషన్ కార్డులు, ఇతర పనుల కోసం వస్తున్న రైతులు, ప్రజలు వెనుతిరిగి వెళు తున్నారు. మండల పరిధిలో 21 పంచాయతీ గాను 18 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం డీఎస్సీ వివిధ ఉద్యోగాల కోసం రాత పరీక్షల నిమిత్తం ప్రిపేర్ అవడానికి సచివాలయం పరిధిలో 40శాతం మంది సిబ్బంది లాంగ్ లీవ్ పెట్టి వెళ్లినట్లు సమాచారం. దీని వల్ల ప్రభుత్వ మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులో సభ్యులను చేర్చుటకు సచివాలయంకు వస్తున్న ప్రజలకు సిబ్బంది లేరంటూ వేచి ఉండి చేసేది ఏమీ లేక తిరిగి ఇంటి వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనా సిబ్బంది కొరత ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో మిగిలిన వారినైనా విధుల్లో ఉండేలా జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు పంపిణీ

ఏ గొల్లపల్లి గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు: కలెక్టర్
సొంత ఇల్లు సమాజంలో విలువను పెంచుతుంది: పూతలపట్టు ఎమ్మెల్యే

అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తవణంపల్లి: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ రికార్డులను పరిశీలించి ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలం ఏ.గొల్లపల్లిలో పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులను గుర్తించి ప్రభుత్వ రికార్డులను పరిశీలించి ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పట్టాల పంపిణీతో ఇల్లు లబ్ధిదారుల సొంతం అయ్యిందన్నారు. పట్టాకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం జరుగుతుందన్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ నియోజకవర్గం తవణంపల్లి మండలం ఏ గొల్లపల్లిలో గత 25 సంవత్సరాల నుండి ఇంటి పట్టాలు లేని వారిని గుర్తించి దాదాపు నెల రోజులలో 47 మందికి ఇంటి పట్టా మంజూరు చేయడం జరుగుతున్నదని, ఇంటి పట్టాల మంజూరులో జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకుని పట్టా పొందని వారికి ఇంటి పట్టా మంజూరు చేయడంతో ఇల్లు పూర్తిగా వారి సొంతమవుతుందన్నారు. ఈకార్యక్రమంతో కుటుంబానికి ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. సొంత ఇల్లు సమాజంలో విలువను పెంచడంతో పాటు కష్టకాలంలో అండగా ఉంటుందన్నారు. పూతలపట్టు నియోజకవర్గం ఎస్సి సామాజికవర్గ ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. శ్మశానానికి భూమి కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, సర్పంచ్ ప్రవీణ్, నాయుడు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ప్రతిభా అవార్డులు కైవసం

ప్రతిభా అవార్డ్స్ పొందిన విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్
రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రకటించిన ప్రతిభా అవార్డులు శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు గంగా మానస, మలిశెట్టి నందలక్ష్మి, తణుకు పద్మిత, కొత్తపల్లి ఇందుప్రియ రావడం జరిగినది. వీరికి తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి, తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా అవార్డును, రూ. 20వేలచెక్కు, ప్రశంసాపత్రం అందించి ప్రశంసించడం జరిగింది. అలాగే విద్యార్థినులను టిటిడి విద్యాధికారి వెంకట సునీల్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరస్వతి, అడ్మిషన్స్ సంచాలకులు ఉదయ్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్నేహలత, విద్యార్థి సమాఖ్య సభ్యులు డాక్టర్ జయమ్మ, సూపరింటెండెంట్ సుశీల, అధ్యాపకులంతా అభినందించారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలల ద్వారా
విద్యా ప్రమాణాల పెంపు: ఎంఈవో

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలో పాఠశాలల పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మొత్తం 8 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈవో పి.హేమలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మోడల్ పాఠశాలలో ఒక ప్రధానోపాధ్యాయుడుతో పాటు, 1 నుండి 5 తరగతుల వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా మొత్తం 5మంది ఉపాధ్యాయులు నియమించబడ్డారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా మండలంలోని అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారని, మోడల్ స్కూల్స్‌లో సమర్థవంతమైన పాఠశాల నిర్వహణ ప్రతి విద్యార్థికి తగిన శ్రద్ధతో విద్య అందించడం నాణ్యమైన విద్యా ప్రమాణాలు కల్పించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ మోడల్ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో విద్యార్థు భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా ముందడుగు వేయాలని సూచించారు.

నాణ్యమైన విద్యకు కేరాఫ్ శ్రీ సాయి మేధా

హెచ్‌ఎం కె.కళ్యాణి, కరస్పాండెంట్ కె.గిరిధర్ మూర్తి

ప్రజాశక్తి- పలమనేరు: మనిషి జీవితానికి, జీవనానికి మనుగడకు విజ్ఞానం అవసరం. ఆ విజ్ఞానానికి మూలం మంచి విలువలతో కూడిన నాణ్యమైన విద్య. అటువంటి నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది శ్రీ సాయి మేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్. పలమనేరులోని రంగాపురం డాక్టర్ జయభారతమ్మ ఇంటి ఎదురుగా ఉన్న సాయిమేధా స్కూల్ ప్రభుత్వ గుర్తింపు పొంది పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తోంది. తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తూ వారు ప్రగతిపథంలో నడిచేలా ఇక్కడి ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు. సాయిమేధలో విద్యార్థులకు విద్యతోపాటు వ్యవసాయం, మూఢనమ్మకాలను నమ్ముకుండా విజ్ఞానంపై నడుపూ భావితరాల పౌరులుగా విద్యార్థులు తీర్చిదిద్దం ఇక్కడి ప్రత్యేకత అని ప్రధానోపాధ్యాయులు కె.కళ్యాణి, కరస్పాండెంట్ కె.గిరిధర్ మూర్తి పేర్కొన్నారు.

సత్తా చాటిన 'శ్రీ శారద' విద్యార్థులు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని శ్రీ శారదా ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులు 2024 - 2025 పదవ తరగతి ఫలితాలతో 100శాతం ఉత్తీర్ణత సాధించారని ఒదని, అలాగే 600 మార్కులకు 594 మార్కులతో అఫీఫా కొనైన్ ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ పుష్పలతా రెడ్డి తెలిపారు. అలాగే శ్వేతశ్రీ 588, లాస్య 587, ఆనిశ్రీ 581, లక్ష్మీచేతన 575, జశ్విత 572, అయిల్ హుసేన్ 571 మార్కులు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో పరీక్షకు 68 మంది హాజరు కాగా అందులో 40 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయ బృందానికీ, విద్యార్థులకు, తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వాణి విద్యాశ్రమ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని వాణి విద్యాశ్రమ పాఠశాల విద్యార్థిని జీ.స్పందన 595 మార్కులతో పలమనేరు మండలంలోని టాపర్‌గా నిలిచి వాణి విద్యాశ్రమ్‌కు కీర్తి గడించారని, పాఠశాల యాజమాన్యం తెలిపింది. తన విజయానికి కారకులైన పాఠశాల యాజమాన్యంకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు స్పందన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే 593 మార్కులతో జిఎస్‌జ యువర్న ద్వితీయ స్థానంలోనూ, కే ప్రణతి 590 మార్కులతో తృతీయ స్థానంలోనూ నిలిచారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించిన 'టీకేసీ'

కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు టికేసి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ చాటారని, 77శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య తెలియజేశారు. బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.గాయత్రి 1000 మార్కులకు 937 మార్కులు, ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టి) కోర్సు విద్యార్థి తబశ్రీ 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి త్రివేణి 470 మార్కులు 443 మార్కులు, రెండవ సంవత్సరంలో 325 మంది విద్యార్థులు పరీక్ష రాయిగా 250 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అలాగే ఎంఎల్‌టి గ్రూపుకు చెందిన వైష్ణవి 500 గాను 490 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం టాపర్‌గా త్రివేణి 470గాను 443 మార్కులు, సెకండియర్ టాపర్‌గా సౌందర్య 1000 మార్కులకు 862 సాధించి నిలిచారు.

ఏడాది కూటమి పాలనలో సంక్షేమం.. అభివృద్ధి

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చరిత్రలో నిలిచిపోయేలా.. హామీలను అమలు చేస్తూ.. సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతోందని, విజన్ కలిగిన నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి పథంలో నడుస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి విధ్వంసకర పాలన నుంచి మంచిని కోరుతూ కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు గొప్పవిజయాన్ని అందించారని.. రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను మొదటి ఏడాదిలోని చాలా వరకు అమలు చేశామన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో యూనివర్సిటీ స్థాపన, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, అడవిపల్లె రిజర్వాయర్ నుండి చిత్తూరు నగరానికి నీటిని తేవడం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లి, ప్రజలకు మంచి పాలన అందిస్తామన్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మామిడి రైతులకు మద్దతు ధర ఇవ్వండి

పక్వానికి వచ్చిన కాయలను దశల వారీగా మాత్రమే కోసి గుజ్జు పరిశ్రమలకు తరలించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్

తవణంపల్లి మండలంలో మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద పరిస్థితిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి రైతులకు ప్రకటించిన మద్దతు ధరను రైతులకందించేలా మామిడి గుజ్జు యాజమాన్యాలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలంలో జిసిఆర్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంఎఫ్‌పిఐ, ఫీల్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రైతులకు అందిస్తున్న మద్దతు ధర, ఇతర సంబంధిత అంశాలకు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తోతాపురి మామిడి రకానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పూర్తిస్థాయి అమలు చేయాలన్నారు. ప్రతి మామిడి గుజ్జు పరిశ్రమ వారు వారి సామర్థ్యం మేరకు జిల్లాలో పండించే తోతాపురి మామిడిని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. తద్వారా రైతులకు మేలు చేసిన వారు అవుతారన్నారు. ఈ దిశగా గుజ్జు పరిశ్రమ యజమానులు కృషిచేయాలని తోతాపురి మామిడి మద్దతు ధరను పూర్తిగా అందజేయాలని ఈ విషయంలో రైతులకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. మామిడి గుజ్జు యాజమాన్యాల వారు సంబంధిత తోతాపురి మామిడి రైతులకు వారి సామర్థ్యం మేరకు రైతులకు ముందస్తుగా టోకెన్లు మంజూరు చేసి దాని ప్రకారం పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే కోసుకొని వచ్చి గుజ్జు కేంద్రాలకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.. ఈ విషయంలో ఆర్‌ఎస్ కె ఇన్చార్జి లు రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సంబంధించిన బోర్డును ప్రదర్శించాలని,గుజ్జు పరిశ్రమల వద్ద విధులకు కేటాయింపబడ్డ సిబ్బంది వద్ద తోతాపురి మామిడి రైతుల పేర్లను కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం ద్వారా అందించే రాయితీని పొందగలరన్నారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో తవణంపల్లి తహశీల్దార్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.



కేంద్రం ఏపికి అత్యధిక నిధులు అందిస్తోంది..

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

డబుల్ ఇంజిన్ సర్కార్ (కేంద్ర రాష్ట్రాల్లో ఒకే కూటమి పాలన) వల్ల ఆంధ్రప్రదేశ్‌కు డబుల్ ధమాకా లభించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈరోజు తిరుపతికి విచ్చేశారు. ఈసందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో బండి సంజయ్‌కు భారత ప్రభుత్వ పౌరవిమానయాన మంత్రిత్వశాఖ విమానాశ్రయ సలహా కమిటీ సభ్యులు పిసి రాయల్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుండి అలిపిరి పోలీస్ స్టేషన్ వద్దకు సంజయ్‌తో కలిసి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా వచ్చారు. అనంతరం స్థానిక హోటల్‌లో 11 ఏళ్ల మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత బీజేవైఎం కార్యకర్త పార్థసారధి నివాసంలో భోజనం చేశారు. అక్కడి నుండి కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి స్వామివారిని కలిశారు. వారితో కొద్దిసేపు భేటి అయిన అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుండి నేరుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడే మొక్కలు నాటారు. తిరుపతి పర్యటనలో భాగంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రానికి లేనంతంగా ఏపీకి కేంద్రం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఏపీని, గట్టెక్కించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, టీడీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, వరప్రసాద్, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వెంకటేష్, మరో ఇద్దరిపై

కేసు నమోదు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : మండలంలోని ఎగువ కమ్మకండిగ పంచాయతీ చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ సోమవారం మండల కేంద్రంలోని తాగునీటి హెడ్ ట్యాంక్‌పైకి విషం బాటిల్‌తో వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని, తన మరణానికి కారణం ఎంపీడీవో అని ఆత్మహత్య ప్రయత్నం చేసిన విషయం విధితమే. వెంకటేష్‌ను వారించి ట్యాంకు నుంచి కిందకు దింపేందుకు తహశీల్దార్ లోకనాథ పిళ్ళై, ఎంపీడీవో మోహన్ మురళి పోలీసులు ప్రయత్నించారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ భార్య కింద నుంచి ఎంపీడీవోపై తన భర్త చావుకు అతనే కారణం అంటూ ఎంపీడీవో ను బెదిరించిన దుర్భాషలాడుతూ ఆయనపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, అతని భార్య సుబ్బలక్ష్మి, అతని తమ్ముడు జ్యోతినాథంపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1994 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాళహస్తి దేవస్థానం వచ్చే భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి పౌర్ణమి రోజు ముక్కంటి భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీవో కార్యాలయ ఏఓగా విజయ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

ఏఓ శ్రీనివాసులుకు వీడ్కోలు పలుకుతున్న ఆర్టీవో మురళీమోహన్

రవాణా శాఖ కార్యాలయం పరిపాలన అధికారిగా విజయ్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం తిరుపతి-కరకంబాడీ మార్గంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయ్ కుమార్‌కు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో పరిపాలన అధికారిగా కొనసాగిన ఎం.శ్రీనివాసులు బదిలీపై మదనపల్లి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయముకు వెళుతుండడంతో ఆయనకు ఆర్టీవో మురళీమోహన్, కార్యదర్శి సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

బిటి రహదారుల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీలో బుధవారం గాజులమండ్యం నుంచి విప్పుమానుపట్టెడ మీదుగా ఏఆర్ రోడ్డు వరకు దాదాపు 17 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బిటి రహదారుల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రేణిగుంట మండలాన్ని కూడా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బలిజల శాంతియుత పాదయాత్ర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్రంలోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన వారికి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ శాంతియుత పాదయాత్రను చేపట్టామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సాన ప్రసాద్ కుమార్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ 1910 నుంచి 1956 వరకు కాపు, బలిజ, తెలగ, ఒంటరి తదితర కులాలకు ఉన్నటువంటి బీసీ రిజర్వేషన్ 1956 తర్వాత అమలు కాలేదని, ఈ కారణం చేత ఈ కులాలలో ఉన్నవారు విద్య, ఉపాధి, ఆర్థిక సామాజిక రంగాలలో వెనుకబాటు తరంతో ఎదగలేక వెనుకబడి పోతున్నారన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీన చిత్తూరులో ప్రారంభమైన శాంతియుత పాదయాత్ర ఎటువంటి రాజకీయ ప్రసంగాలు చెయ్యకుండా శాంతియుత మార్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని వినతి పత్రాన్ని సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు రాయల్, ప్రతాప్, రమేష్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగను ఈనెల 19న తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు మహానగరంలో ఘనంగా సన్మాన సభను నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సన్మాన సభ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలలోని విహెచ్‌పిఎస్ జాతీయ కమిటీ పిలుపుమేరకు పెద్ద ఎత్తున వికలాంగ సోదర సోదరీమణులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, దేవదాసు మాదిగ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వ్యథాభరితం - గ్రామీణ వృద్ధాప్యం

శాస్త్ర సాంకేతిక, వైద్య ఆరోగ్య రంగాలలో నేడు మనం సాధించిన ప్రగతి, మనజీవన ప్రమాణాలను పెంచాయి. మానవుని ఆయుష్కాలం గణనీయంగా పెరిగి ప్రజలు ఎక్కువకాలం జీవిస్తున్నారు. 1951వ సంవత్సరంలో 37 సంవత్సరాలుగా ఉన్న మన ప్రజల ఆయుష్కాలం పురుషులు, స్త్రీలలో వరుసగా 2011వ సంవత్సరంలో 67.3, 69.6 సంవత్సరాలకు పెరిగింది. ఇది 2021 సంవత్సరానికి 69.8, 72.3 సంవత్సరాలుగా వుండవచ్చునని అంచనా. ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తుండటంతో దేశంలో వృద్ధుల శాతం క్రమంగా పెరుగుతున్నది.

వేగంగా పెరుగుతున్న గ్రామీణ వృద్ధులు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో అంటే 1951 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 5.5 శాతం వున్న వృద్ధుల సంఖ్య 2001వ సంవత్సరానికి 7.4 శాతానికి పెరిగింది. 2011 సంవత్సరం జనాభా లెక్కలలో ఇది సుమారు 8.3 శాతంగా ఉండి 2025కి 16 కోట్లకు (12 శాతం) మించవచ్చునని అంచనాలు చెపుతున్నాయి. ఆనాదిగా మనది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. కాని నేడు విద్య ఉపాధి అవకాశాల కోసం గ్రామీణ యువత మలి వయస్సులో ఉన్న తల్లిదండ్రులను గ్రామాల్లోనే వదలి పట్టణాలకు వెళ్ళిపోతున్నారు. మరోవైపు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్ళిన వారు ఉద్యోగ విరమణ తర్వాత పట్టణ జీవితానికి సర్దుబాటుకాలేక తిరిగి గ్రామాల్లోనికి వచ్చేస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలలో వృద్ధుల శాతం పట్టణాలకంటే అధికంగా వుంటున్నది. 2001 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో గ్రామీణ ప్రజల జనాభా 72 శాతం వుంటే మొత్తం వృద్ధుల జనాభాలో 75 శాతం గ్రామాల్లోనే నివసిస్తున్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరాగా వృద్ధులు

గ్రామీణ వృద్ధులు ఆరోగ్యంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నంతవరకు వారి కుటుంబాలకే కాకుండా సమాజ శ్రేయస్సుకు, దేశ ఆర్థిక వ్యవస్థకు తమ అనుభవంతో కూడిన నైపుణ్యంతో నిరంతరం సేవలందిస్తూనే ఉంటారు. గ్రామీణ ప్రాంతాలలోని వృద్ధులను సాంప్రదాయ విజ్ఞాన గనిగా చెప్పవచ్చును. సర్దుబాటుతో సహజీవనం, విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడం సత్ప్రవర్తన, నైతిక విలువలతో కూడిన జీవన సందేశాలను వృద్ధులు వారసత్వ సాంప్రదాయ సంపదగా ముందు తరాలకు అందిస్తున్నారు.

వృద్ధులపైన వ్యవసాయ భారం

గ్రామీణ ప్రాంతాల నుండి విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత వృద్ధ తల్లిదండ్రులను గ్రామాలలోనే వదలి పట్టణ ప్రాంతాలకు వలస వెళుతుండడంతో, గ్రామీణ ప్రాంతాల్లో నేడు వ్యవసాయం మరియు పశుపోషణాభారం వృద్ధులపైన మోపబడుతున్నది. ప్రస్తుతం గ్రామాల్లో వృద్ధులు, రైతులుగా, పశుపోషకులుగా, వ్యవసాయ కూలీలుగా, కుటుంబ సంరక్షులుగా, విశిష్ట వ్యవసాయ అనుభవశాలులుగా అనేక రకాలైన ఉత్పాదక పనులు చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

గ్రామాల నుండి పట్టణాలకు పెరుగుతున్న వలసలు, గ్రామాలలో వృద్ధుల శాతం పెరుగుదల మన ఆర్థిక వ్యవస్థకు పునాది అయిన వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.వ్యవసాయం వృద్ధులపై ఆధారపడటం, వ్యవసాయ కూలీల కొరతతో భవిష్యత్తులో వ్యవసాయ సాగు విస్తీర్ణం తగ్గిపోయి కేవం కుటుంబ అవసరాలకు సరిపడే విధంగా సాంప్రదాయ సాగుపై వృద్ధ రైతులు మొగ్గుచూపే ప్రమాదముంది. ఈ కారణంగా మన సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోవడమే కాకుండా ఆహార ఉత్పత్తి కూడా ప్రమాదంలో పడవచ్చు.

నిరాదరణకు గురౌతున్న గ్రామీణ వృద్ధులు:

వడివడిగా మారుతున్న నేటి ఆధునిక సమాజంలో వృద్ధుల అనుభవాలను, విజ్ఞానాన్ని నేటి యువత గుర్తించక నిరాదరణకు గురిచేస్తున్నారు. చాలా మంది గ్రామీణ వృద్ధులు కనీస అవసరాలైన నివాసం, ఆహారం, ఆరోగ్యంవంటివి కూడా లభించక ఇబ్బందులకు గురవుతున్నారు. నిస్సహాయ పరిస్థితులలో కొంతమంది పెద్దలు అనాథ ఆశ్రమాలను, వృద్ధాశ్రమాలను అవసరాలకోసం ఆశ్రయిస్తున్నారు. నేడు సమాజంలో పెరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలన్నీ కుటుంబాలలో యువతకు నైతిక విలువలు, సత్ప్రవర్తన నేర్పే పెద్దలను కుటుంబాలు దూరం చేస్తున్న కారణంగానేనని చెప్పవచ్చును. గ్రామీణ వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలైన ఆర్థిక ఇబ్బందులు, ప్రేమానురాగాల కోసం ఎదురుచూపు, ఒంటరితనం భావోద్వేగ సమస్యలు, ఆరోగ్య సమస్యలు అతి కీలకమైనవిగా చెప్పవచ్చును. ఆరోగ్యం సరిగా లేనప్పుడు మిగతావన్నీ అంత ప్రాముఖ్యతను సంతరించుకోవు.

వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు జాతీయ పథకం

కాబట్టి జనాభాలో పెరుగుతున్న గ్రామీణ వృద్ధుల సంఖ్య దృష్ట్యా ప్రభుత్వం గ్రామీణ వృద్ధిలు అనుకూల వైద్య సదుపాయాల విషయంలో ప్రభుత్వం మరిన్ని ప్రత్యామ్నాయం పరిష్కార మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం వుంది. దేశంలో వృద్ధులకు మెరుగులైన వైద్య సేవలు అందించుటకు "జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ పథకం"ను కేంద్ర ప్రభుత్వం 2011 లో ప్రారంభించిది. వైద్యులకు, వైద్య సిబ్బందికి వృద్ధుల ఆరోగ్యం (జెరియాట్రిక్స్) పై ప్రత్యేక శిక్షణ, జిల్లా, ప్రాథమిక మరియు గ్రామ స్థాయి ఆరోగ్య ఉపకేంద్రాలలో వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అనేక చర్యలు పథకాలలో ప్రతిపాదించారు. కాని ఆచరణలో ఈ పథకం గ్రామీణ వృద్ధులకు ఆశించినంతగా ఫలితాలేమి ఇవ్వడం లేదని చెప్పాలి.

గ్రామ స్థాయిలో వృద్ధులకు వైద్యం మంచిది

వృద్ధులకు ఎదురయ్యే చాలా ఆరోగ్య సమస్యలు వయస్సు పెరగడంతో వచ్చేవే. వీటిని చాలా వరకు ప్రాథమిక స్థాయిలోనే వృద్ధులకు అవగాహన కల్పించి, వయస్సుతో వచ్చే సమస్యలు వాటి నివారణకు పాటించవలసిన ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశు భ్రత, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవన విధానం వంటివి గ్రామ స్థాయిలో పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, "ఆషా" వర్కర్లకు వృద్ధులకు ఆరోగ్యంపై తగిన శిక్షణ ఇచ్చి గ్రామ స్థాయిలోనే సరియైన వైద్యం అందించవచ్చు. అవసరమైన వారిని మాత్రం ప్రత్యేక వైద్యం కోసం పై స్థాయి ఆసుపత్రికి సిఫార్సు చేయవచ్చు. కానీ గ్రామీణ వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో వారు ఆశించినంత స్థాయిలు సాయం అందడం లేదనేది వాస్తవం.

వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంవృద్ధులకు అందిస్తున్న పెంచిన వృద్ధాప్య పింఛను గ్రామీణ వృద్ధుల ఆరోగ్య ఖర్చులకు ఆసరా కల్పిస్తున్నది. ఇది పేద వృద్ధుల పాలిటి వరంగా భావించవచ్చును. ఇవే కాక బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలు కూడా గ్రామీణ వృద్ధుల కొంతవరకు ఊరటనిస్తున్నవి. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటే సరఫరా చేస్తున్న సలహాలు, విత్తనాలు, ఎరువులు, పనిముట్లు గ్రామీణ వృద్ధ రైతులకు చాలా ఉపయోగకరంగా వున్నాయి.

వృద్ధుల మానసిక ప్రశాంతత కోసం...

ఆధ్యాత్మిక చింతన, వృద్ధులలో ప్రశాంతత, మాన సిక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి భజన మందిరాలు నిర్మించడం వలన వృద్ధులు తీరిక సమయాలను దైవచింతనలో గడిపి మానసిక ప్రశాంతతను పొందుటకు అవకాశముంటుంది. ఈ భవనాలను గ్రామ వృద్ధ సంఘాల నిర్వహణకు కూడా ఉపయోగకరంగా వుంటుంది. ఆనాదిగా మనది వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ. నేడు గ్రామాలలో వృద్ధుల శాతం క్రమంగా పెరుగుతూ యువకుల సంఖ్య తగ్గుముఖం పడుతున్న తరుణంలో మన దేశ వ్యవసాయ సుస్థిరత కొరకు గ్రామీణ వృద్ధుల శ్రేయస్సుకు అత్యధిక ప్రాధానతనివ్వలసిన అవసరం ఎంతైనా వుంది.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -తడ: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల కు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు బ్యాగులు, యూనిఫామ్ మొదలైన విద్యార్థి కిట్లను మండలంలోని అన్ని పాఠశాలలకు బుధవారం సరఫరా చేశారు. గురువారం నుంచి కిట్లను విద్యార్థులకు అందిస్తామని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా గతంలో బియ్యం బదులుగా సన్నబియ్యాన్ని మధ్యాహ్న భోజన పథకంలో వండి వడ్డించాలని ఉన్నతాధికారులు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో బియ్యం నేరుగా పాఠశాలల వద్దకే చేర్చుతారని తెలిపారు. రేపు తప్పని సరిగా పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందించాలని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

గరుడ సేవలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కె రోజా

గరుడసేవలో మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దేదీప్యమానంగా సాగిన గరుడ సేవలో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించగా వేదమంత్రో చ్చారణ మధ్య ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ఆమె దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో నేత్రపర్వంగా సాగిన గరుడవాహనసేవను తిలకించారు. ఆమె వెంట స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వెంకటేశ్వరుడు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గరుడవాహనంపై ప్రసన్న విహరించారు. ఆలయ అర్చకులు ఘనంగా, అత్యంత వైభవంగా గరుడోత్సవ వేడుకల్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా సోమినేని పెంచలనాయుడు- వసంతమ్మ , ప్రసాద్-అనూష , నిధీష్ లు వ్యవహరించారు. టిడిపి గూడూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, పెంచలకోన పెనుశిల దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షులు తానంకి నానాజీ స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవకమిటీ సభ్యులు, శ్రీకంటి రామమోహన్ రావు , ఆలయ కార్యనిర్వాహణాధికారి ముసునూరి రవిక్రిష్ణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తమ సిబ్బంది సహకారంతో అన్ని చర్యలు తీసుకున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తి కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ నగదు దోచుకెళ్లిన కేసు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదయింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు బుధవారం చిత్తూరు జానకారపల్లి పల్లికి చెందిన అజయ్ కుమార్ అలియాస్ సింగమలై అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వన్ టౌన్ సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

షర్మిల సభ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: నేడు శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సభకు సంబంధించి పోస్టర్లను బుధవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. షర్మిల సభకు, ర్యాలీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, కళిందర్, శబరి రాజన్, గురుమూర్తి, సీతారాం, భాస్కర్ యాదవ్, భాస్కర్ రెడ్డి, ఆంటోనీ, చందు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పర్యటనకు బుధవారం విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు భారత ప్రభుత్వ పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ విమానాశ్రయ సలహా కమిటీ సభ్యులు పిసి రాయల్ ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయంలో కేంద్రమంత్రి సంజయ్ కుమార్ కు పుష్పగుచ్చం అందించి, దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కారు, ద్విచక్రవాహనం ఢీ
ఒకరు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన వడమాల పేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ఎస్‌వీపురానికి వడమాల గ్రామానికి చెందిన జానీ (21) మలాడి కంపెనీలో పనిచేస్తారు. వడమాలపేట నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా స్థానిక టోల్ ప్లాజా నుంచి ఎదురుగా వస్తున్న కారు మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో జానీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. జానీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

ఆగని అక్రమార్కుల ఆగడాలు!

- యథేచ్ఛగా మట్టితరలింపు
- అధికారులు అడ్డుకున్నా తాత్కాలికం

ప్రజాశక్తి-నాయుడుపేట: మట్టి, ఇసుక,గ్రావెల్ ఇలా ఏది పడితే అది ప్రభుత్వం కన్నుగప్పి ఇష్టానుసారంగా తవ్వేసి తరలిస్తూ లక్షలు గడిస్తూ తమకు ఏది అతీతం కాదు' అంటూ అక్రమార్కులు రోజు రోజుకి విజృంభిస్తున్నారు. ఒకవేళ సమాచారం తెలిసిన అధికారులు అడ్డుపడినా అది తాత్కాలికంగా మారుతోంది. మళ్లీ మరుసటి రోజు యధావిధిగా వాళ్ల ఇష్టం వచ్చినట్టు తవ్వేసుకుంటూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు అనేకసార్లు హెచ్చరించినా అవేమీ లక్ష్యం చేయకుండా అధికారులు వచ్చినప్పుడు వారి ముందు అలా తప్పుకుని మళ్లీ యధావిధిగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట మండల పరిధిలోని గొట్టిప్రోలు గ్రామ పంచాయతీ లో ఉన్న నారాయణ రెడ్డి కండ్రిగ, ఎర్రగుంట చెరువులో అనధికారిక అక్రమ గ్రావెల్ తరలింపు గత కొద్ది రోజులుగా సాగుతోంది. గ్రావెల్ తవ్వకాల్లో మట్టి మాఫియా అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ గ్రామపంచాయతీ అధికారుల కళ్లు కప్పి వందలాది టిప్పర్లను తరలించుకుపోవడంలో అక్రమార్కులు ఎవరినీ లెక్క చేయడం లేదు. వీరికి రాజకీయ అండ పుష్కలంగా ఉండడంతో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజల కళ్లముందే ఇదంతా జరుగుతున్నప్పటికీ వీరిని అడ్డుకునే ధైర్యం చేయలేక ప్రజలు నిస్సహాయంగా చూస్తూ ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో గ్రామస్తులు నుంచి అధికారులకు పలు కోణాల్లో అనేక ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అధికారులు చేపడుతున్న చర్యలు నామామాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు ను ఈ అక్రమాలపై వివరణ కోరగా ఆయన స్పందిస్తూ ప్రజల ఫిర్యాదుల మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మట్టి తరలిస్తున్న వారిని తీవ్రంగా మందలించామని చెరువు మట్టికి ఎవరి అనుమతులు లేకుండా ఎలా తీస్తారని హెచ్చరించి తక్షణం యంత్రాలను తరలించకపోవాలని మందలించామని మరోసారి అక్రమ తవ్వకాలకు పాల్పడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని అక్రమార్కుల హెచ్చరించినట్లు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ హెచ్చరించినా తాత్కాలికంగా యంత్రాలను తరలించుకు వెళ్లినా మట్టి తవ్వకాలను పూర్తిగా నిలుపుదల చేయలేకపోతున్నారు. మట్టి తవ్వకాలు అధికారులు పూర్తిస్థాయిలో ఆపకపోవడం పై పలువురు విమర్శిస్తున్నారు. ఇలా అక్రమంగా కొనసాగుతున్న అక్రమ మట్టి తోలకాలపై నాయుడుపేట తహశీల్దార్ ఏ.రాజేంద్రను ప్రశ్నించగా ఆయన మాట్లాడుతూ ఈ అక్రమ మట్టితోలకాల విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని మట్టిని తరలించకపోతుండడంపై గొట్టిప్రోలు వీఆర్వో ను పంపించామని వీఆర్వో వెళ్లి ఇరిగేషన్ అధికారులు హెచ్చరించిన వారి ఆదేశాలు అతిక్రమించి యంత్రాలతో యధావిధిగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిని హెచ్చరించారని అయినప్పటికీ వారు వినకుండా యధావిధిగా మట్టితో అవకాశం పాల్పడుతూ ఉండడంతో తాను తమ సిబ్బందితో వెళ్లి హిటాచి యంత్రాలను ఆ ప్రాంతం నుండి వెళ్లగొట్టామని, మళ్లీ తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని మళ్లీ వాళ్లు ఇలా అక్రమ తవ్వకాలు పాల్పడితే పోలీసుల సాయం తీసుకుని వాహనాలు సీజ్ చేసి వారందరిని అదుపులోకి తీసుకుని వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అక్రమ తవ్వకాలు మళ్ళీ పునరావృతం అయ్యే అవకాశం ఉండదని తెలిపారు. ఇకనైనా అధికారులు గట్టి చర్యలు చేపట్టి ఈ అక్రమాలకు స్వస్తి పలకాలని గ్రామస్తులంతా కోరుకుంటున్నారు.

స్విమ్స్‌ను అత్యున్నతంగా తీర్చిదిద్దుతాం

501 మంది వైద్యవిద్యార్థులకు పట్టాలు
40 మందికి బంగారు పతకాలు
వేడుకగా 13వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రపంచంలోనే అత్యున్నత సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దుతామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అన్నారు. శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం బుధవారం మహతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. 501 మంది వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. 40 మందికి బంగారు పతకాలను అందించారు. యూనివర్సిటీ ఛాన్సలర్ హోదాలో బిఆర్ నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎయిమ్స్ సిఇఒ డాక్టర్ హనుమంతరావు, టిటిడి ఈవో శ్యామలరావు, పాలకమండలి సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎన్.సదాశివరావు, తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డాక్టర్ జి.రఘునందన్, స్విమ్స్ డీన్ డాక్లర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్ నివేదికను సమర్పించారు. అనంతరం బిఆర్ నాయుడు మాట్లాడుతూ అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 1993లో ప్రారంభించారన్నారు. ప్రస్తుతం మహావృక్షమై రాయలసీమ ప్రజలకే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తోందన్నారు. ప్రతిరోజూ దాదాపు 1500 ఒపి విభాగానికి హాజరవుతున్నారని, 750 మంది ఇన్‌పేషంట్లు చికిత్స పొందుతున్నారన్నారు. రోజూ 30-50 ఆపరేషన్లు జరుగుతుంటాయి. పబ్లిక్ రంగంలోనే మొత్తం భారతదేశంలో రెండో మహిళా వైద్య కళాశాలగా శ్రీ పద్మావతి మెడికల్ కాలేజీ ఏర్పడి సాలీనా 175 మంది మహిళా వైద్యులను తయారు చేస్తుందన్నారు. కార్డియాలజీ, కార్డియక్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆంకాలజీలలో అత్యుత్తమ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను స్విమ్స్ అందిస్తోందని, స్విమ్స్ కు టిటిడి 60 కోట్లు రెవిన్యూ గ్రాంటు సాలీనా అందిస్తుండగా ప్రాణదాన ట్రస్టు కింద మరో 24 కోట్లు ఇస్తున్నామన్నారు. వైద్య పరిశోధనల కోసం శ్రీ బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకం క్రింద నిధులు ఇస్తున్నామన్నారు.. 2005 మంది విద్యార్థులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. దాదాపు 600 కోట్లతో కొత్త కట్టడాలు నిర్మితమతున్నాయని, అందులో క్యాన్సర్ బ్లాక్, కార్డియోన్యూరో బ్లాక్, స్పెషాలిటీ బ్లాక్, సెంట్రల్ కిచెన్, సెంట్రల్ గోడౌన్, స్టాఫ్ క్వార్టర్స్, రోగుల కుటుంబీకులకు చౌల్ట్రీ అందుబాటులోకి రానున్నాయన్నారు. త్వరలోనే 550 డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్ల నియామకం చేపడతామన్నారు. డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ వైద్యులకు ధనార్జనే ధ్యేయం కాదన్నారు. ఎప్పటికప్పుడు అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకుని మానవత్వంతో సమాజానికి వైద్యసేవలు అందించాలని సూచించారు. కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవరచుకోవాలని, యోగా మెడిటేషన్లు వృత్తిపరమైన ఒత్తిళ్లను తగ్గించుకోడానికి దోహదపడతాయన్నారు.

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం మొక్కలు నాటారు. గ్రౌండ్ వద్దకు వచ్చిన ఆయనకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు రవి మనోహర్ ఆచారి, నాగభూషణం రావు, శ్రీనివాసరావు, డీఎస్పీ లు భక్తవత్సలం, శ్యామ్ సుందర్, రామకష్ణా చారి, చిరంజీవి పాల్గొన్నారు.